# విశాల భారతి

24-04-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ | సంపుటి:4 సంచిక: 113




## బెంగాల్, తమిళనాడులో ఓటర్ల ప్రభంజనం

- బెంగాల్ 91.46శాతం, తమిళనాడు 84.41శాతం రికార్డు పోలింగ్
- తమిళనాడులో ఎన్నికలు పూర్తి; బెంగాల్‌లో 152 సీట్లకు పోలింగ్ షురూ
- ఏప్రిల్ 29న బెంగాల్ చివరి దశ; మే 4న కౌంటింగ్
- విధులకు గైర్హాజరైన బెంగాల్ పోలింగ్ సిబ్బందిపై ఈసీ వేటు
- బెంగాల్‌లో టీఎంసీ-బీజేపీ ఘర్షణలు; పోలీసుల లాఠీఛార్జి

02




తెలంగాణ రాష్ట్ర రవాణా రంగం పెను నిప్పుల కొలిమిని తలపిస్తోంది. తమ న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె మూడో రోజుకు చేరుకోగా, ఊహించని రీతిలో చోటుచేసుకున్న ఒక ఘటన యావత్ రాష్ట్రాన్ని ఉలిక్కిపడేలా చేసింది. వరంగల్ జిల్లా నర్సంపేట డిపోలో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్ కోల శంకర్ గౌడ్ ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ నిప్పు అంటించుకోవడం సంచలనం సృష్టించింది. కేవలం ఒక నిరసనగా మొదలైన ఈ పోరాటం, ఇప్పుడు బలిదానాల దిశగా మలుపు తిరుగుతుండటంతో అటు ప్రభుత్వం ఇటు కార్మిక సంఘాల మధ్య ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి.


# బలి దానాల దిశగా ఆర్టీసీ సమ్మె

ప్రభుత్వంపై నిరసనగా డ్రైవర్ శంకర్ గౌడ్ నిప్పంటించుకున్నారు

- డ్రైవర్ పరిస్థితి విషమించడంతో డిపోల వద్ద ఆగ్రహజ్వాలలు
- డిమాండ్ల సాధనకై రెండో రోజూ స్తంభించిన బస్సులు
- మంత్రి ప్రకటనపై కార్మికులు శాంతించక సమ్మె ఉధృతం
- రవాణా స్తంభించడంతో సామాన్యులకు తీవ్ర ఇబ్బందులు
- సమ్మె హింసాత్మక మలుపు తిరుగుతోందని ఇంటెలిజెన్స్ హెచ్చరిక

03





## అంతులేని కథగా కాళేశ్వరం

కమిషన్ నివేదికపై చర్యలను హైకోర్టు అడ్డుకుంది



- కమిషన్ నివేదికపై చర్యలను హైకోర్టు అడ్డుకుంది
- కుట్రలు వీగిపోయాయని హరీష్, కేటీఆర్ సంబరాలు
- సాంకేతిక లోపాలేనని, విచారణ కొనసాగుతుందని వెల్లడి
- విచారణ కోరుతూ కాంగ్రెస్, బీజేపీ మధ్య విమర్శలు
- కాళేశ్వరం చుట్టూనే తెలంగాణ పార్టీల యుద్ధం
- మేడిగడ్డలో కేంద్ర అధికారి పర్యటనపై బండి లేఖ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయ యవనికపై 'కాళేశ్వరం' మహా ఘట్టం ఇప్పుడు ఒక అంతుచిక్కని మలుపు తిరిగింది. నిన్నటి వరకు అధికార కాంగ్రెస్ పార్టీకి రాజకీయ అస్త్రంగా, బీఆర్ఎస్ పార్టీకి ఒక బలహీనతగా భావించిన ఈ ప్రాజెక్టు అంశం, హైకోర్టు తాజా తీర్పుతో సమీకరణాలను ఒక్కసారిగా తలకిందులు చేసింది. ముఖ్యంగా పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై న్యాయస్థానం వెలువరించిన ఆదేశాలు రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ తీర్పు గులాబీ దళంలో కొత్త ఉత్సాహాన్ని నింపగా, వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్న హస్తం పార్టీకి కొంతపాటి విరామాన్ని, ఆలోచించాల్సిన పరిస్థితిని కల్పించింది. అటు కేంద్ర దర్యాప్తు సంస్థల మౌనం, ఇటు రాష్ట్ర రాజకీయ నేతల వాదోపవాదాల మధ్య కాళేశ్వరం చుట్టూ అల్లిన రాజకీయ వలయం ఇప్పుడు మరింత బిగుసుకుంటోంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, తన మేధోమథనానికి ప్రతిరూపంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కాలక్రమేణా మిగతా 2లో..



## 17 ఆర్టీసీకి రోజూ కోట్ల లాస్

- సమ్మె 2వ రోజు, డ్రైవర్ ఆత్మహత్యాయత్నంతో వరంగల్‌లో టెన్షన్
- బస్సులు డిపోలకే పరిమితం, ఒక్కరోజే రూ.17 కోట్ల నష్టం
- ప్రైవేట్ చార్జీలు 50శాతం పెంపు, ప్రయాణికుల అల్లాటప్పా
- తెలంగాణ సమ్మెతో ఏపీ ఆర్టీసీకి భారీగా ఆదాయం
- విలీనం సాధ్యం కాదన్న సర్కార్; చర్చలు విఫలం
- జేఏసీ డిమాండ్లపై వెనక్కి తగ్గకపోవడంతో కొనసాగుతున్న సమ్మె

03


## తెలంగాణలో వైద్యం భారం

### దేశంలోనే అత్యధిక వైద్య ఖర్చులు తెలంగాణలోనే

- జాతీయ సగటు కంటే ఇక్కడ చికిత్స భారం 39శాతం ఎక్కువ
- కార్పొరేట్ ఆసుపత్రుల్లో సగటు ఖర్చు రూ. 72,561 దాటుతోంది
- 10శాతం కుటుంబాలు కేవలం వైద్యం కోసమే అప్పులు చేస్తున్నాయి
- ప్రభుత్వ దవాఖానాల్లో సగటు ఖర్చు కేవలం రూ. 5,856
- బడ్జెట్ పెంచి ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ సేవలు పెంచాలి



విశాలభారతి, స్టేట్ బ్యూరో: హైదరాబాద్ మహానగరం నేడు ప్రపంచస్థాయి వైద్య సదుపాయాలకు చిరునామాగా నిలుస్తోంది. అత్యాధునిక శస్త్రచికిత్సల నుంచి అత్యవసర వైద్య సేవల వరకు భాగ్యనగరం కేరాఫ్ అడ్రస్‌గా మారింది. మిగతా 4లో..




## ఉద్యోగుల యుద్ధం..!

- డిమాండ్ల సాధనకై ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళన బాట
- 52శాతం ఫిట్‌మెంట్, 5 డీఏలు, పాత పెన్షన్ పునరుద్ధరణ
- రూ. 13 వేల కోట్ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్
- ప్రభుత్వ స్పందన లేనందున నిరాహార దీక్షలకు పిలుపు

02



## ₹941 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్ సిద్ధం

- ఎల్బీనగర్ - హయత్‌నగర్ మధ్య 7.1 కి.మీ. డబుల్ డెక్కర్ నిర్మాణం
- ఒకే పిల్లర్‌పై హైవే, మెట్రో.. దేశంలోనే రెండో అతిపెద్ద కారిడార్
- 20 లక్షల మందికి ట్రాఫిక్ విముక్తి; 15 నిమిషాల్లో నగరం దాటొచ్చు

02

## ఆర్టీసీతో పెట్టుకుంటే కేసీఆర్ పరిస్థితే

- కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంలో కాంగ్రెస్ విఫలం
- 60 వేల మంది ఉన్న సిబ్బంది 38 వేలకు తగ్గడంపై ఆందోళన
- ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేటు సంస్థలకు ఇవ్వడంపై ఆగ్రహం
- పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీలను వెంటనే చెల్లించాలి
- ప్రభుత్వం హామీలు విస్మరించడం వల్లే కార్మికుల పోరాటం
- గత ప్రభుత్వం లాగే కాంగ్రెస్ కూడా కార్మికులను వేధిస్తోంది



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఆర్టీసీ కార్మికులు తెలంగాణ మలిదశ ఉద్యమంలో సామాజిక బాధ్యతతో పాల్గొని అనేక సమరశీల పోరాటాలు చేశారని భారతీయ జనతా పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ కొనియాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం సకల జనుల సమ్మెలో భాగంగా కార్మికులు పోషించిన పాత్రను తెలంగాణ సమాజం ఎప్పటికీ విస్మరించలేదని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్ర పరిపాలన కాలంలో ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ మిగతా 3లో..



## క్యాబినెట్‌ను టెన్షన్ పెట్టిన ఆర్టీసీ సమ్మె

- ఆత్మాహుతి యత్నాలతో ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వం కలవరం
- క్యాబినెట్ అజెండా పక్కనపెట్టి సమ్మెపైనే మంత్రుల సుదీర్ఘ భేటీ
- అఘాయిత్యాలకు పాల్పడవద్దని కార్మికులకు నలుగురు మంత్రుల విజ్ఞప్తి
- పరిష్కారం కోసం యూనియన్లతో డిప్యూటీ సీఎం భట్టి చర్చలు
- ఆత్మహత్యలు సమ్మెను ఉధృతం చేస్తాయని ప్రభుత్వం ఆందోళన
- సచివాలయ భేటీలోనే సమస్య కొలిక్కి వస్తుందని సర్కార్ ఆశ

03

# అంతులేని కథగా కాళేశ్వరం

**మొదటిపేజీ తరువాయి**



ఆ పార్టీకి ఒక సవాలుగా మారింది. 2023 ఎన్నికల ముంగిట మేడిగడ్డ బరాజ్ పియర్స్ కుంగిపోవడం ఆ పార్టీ పతనానికి నాంది పలికిందనే విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తాయి. అధికారం కోల్పోయిన తర్వాత కూడా ఈ అంశం బీఆర్ఎస్ వెన్నాడుతూనే ఉంది. తొలుత ఆత్మరక్షణలో పడిన గులాబీ నేతలు, ఆ తర్వాత గళం విప్పి ఎదురుదాడికి దిగడం గమనార్హం. జగిత్యాల సభ జరిగిన రోజే కాంగ్రెస్ నేతలు మేడిగడ్డ సందర్శనకు వెళ్లడం యాదృచ్ఛికమో లేక పక్కా ప్రణాళికో అన్నది చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్షంలో ఉన్నా సరే, తమ ప్రాజెక్టు డిజైన్లలో లోపం లేదని, అది కేవలం ప్రకృతి వైపరీత్యమో లేక కుట్ర కోణమో అని నిరూపించేందుకు బీఆర్ఎస్ గట్టి ప్రయత్నాలే చేస్తోంది. మరోవైపు అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరాన్ని ఒక భారీ కుంభకోణంగా చిత్రించే ప్రయత్నం చేస్తోంది. రాహుల్ గాంధీ స్వయంగా ప్రాజెక్టును సందర్శించి దీనిని 'అవినీతికి నిలువుటద్దం' అని అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అంశాన్ని రాజకీయంగానే కాకుండా న్యాయపరంగా కూడా తుది అంకం వరకు తీసుకెళ్లాలనే పట్టుదలతో ఉన్నారు. ఇందులో భాగంగానే జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయడం, వందలాది మంది సాక్షులను విచారించి నివేదిక సిద్ధం చేయడం వంటి పరిణామాలు చకచకా జరిగిపోయాయి. అయితే ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తీసుకునే చర్యలపై హైకోర్టు స్టే విధించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఆశించిన ఫలితం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన క్లిష్ట స్థితిలో పడిపోయింది. ఈ రాజకీయ యుద్ధంలో భారతీయ జనతా పార్టీ పాత్ర కూడా అత్యంత ఆసక్తికరంగా మారింది. ఒకవైపు కాళేశ్వరం విషయంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూనే, మరోవైపు సీబీఐ విచారణ విషయంలో కేంద్రం ఎందుకు జాప్యం చేస్తోందన్న కాంగ్రెస్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి వస్తోంది. సీబీఐ విచారణపై స్పష్టత ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారనే విమర్శలను బీజేపీ నేతలు ఎదుర్కొంటున్నారు. తాజాగా ఎన్డీఎస్ఏ చైర్మన్ అనిల్ జైన్ మేడిగడ్డ పర్యటనలో పాల్గొనడంపై బండి సంజయ్ లేఖ రాయడం కొత్త చర్చకు దారితీసింది. అధికారిక సంస్థలను రాజకీయాల్లోకి లాగుతున్నారని ఒక వర్గం అంటుంటే, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకే ఈ లేఖ అని కమలం పార్టీ నేతలు సమర్థించుకుంటున్నారు. ఇలా మూడు ప్రధాన పార్టీల మధ్య కాళేశ్వరం ఒక త్రిముఖ పోరుగా మారిపోయింది. హైకోర్టు తీర్పు వెలువడగానే బీఆర్ఎస్ శిబిరంలో పండుగ వాతావరణం నెలకొంది. సహజ న్యాయ సూత్రాలను తుంగలో తొక్కారన్న తమ వాదనను కోర్టు అంగీకరించిందని ఆ పార్టీ నేతలు సంబరపడుతున్నారు. ముఖ్యంగా ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా విచారణ సాగిందని న్యాయస్థానం అభిప్రాయపడటం తమకు దక్కిన నైతిక విజయంగా హరీష్ రావు అభివర్ణించారు. రాజకీయ కక్షసాధింపు కోసమే ఈ కమిషన్లను ఏర్పాటు చేశారని, ధర్మం ఎప్పటికైనా గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత కొన్ని నెలలుగా కాళేశ్వరంపై వస్తున్న విమర్శలకు ఈ తీర్పు ఒక ముగింపు పలకడమే కాకుండా, పార్టీ కేడర్‌లో కొత్త జోష్ నింపిందని గులాబీ నేతలు భావిస్తున్నారు. కేటీఆర్ అయితే ఒక అడుగు ముందుకు వేసి పీసీ ఘోష్ కమిషన్‌ను 'పీసీసీ కమిషన్' గా అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ రాసిన స్క్రిప్టునే కమిషన్ నివేదికగా ఇచ్చిందని, దీనికి ఎలాంటి చట్టబద్ధత లేదని ఆయన ఆరోపించారు. అబద్ధాలకు ఆయుష్షు తక్కువని, ఇన్నాళ్లూ కాంగ్రెస్ చేసిన దుష్ప్రచారం ఇప్పుడు హైకోర్టు సాక్షిగా వీగిపోయిందని విమర్శించారు. ప్రాజెక్టులో లోపాలు వెతకడం మానేసి, దానిని ఎలా పునరుద్ధరించాలో ఆలోచించాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ తీర్పు కేవలం ఒక సాంకేతిక విజయం మాత్రమే కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలపై ప్రజల్లో ఉన్న అనుమానాలను పటాపంచలు చేసిందని కేటీఆర్ పేర్కొనడం గమనార్హం. తీర్పు తర్వాత అధికార పక్షంలో నిశ్శబ్దం ఆవరించినా, అది తాత్కాలికమేనని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయిన ఆయన, తదుపరి న్యాయ పోరాటంపై సుదీర్ఘంగా చర్చించారు. కోర్టు కేవలం సాంకేతిక కారణాలతోనే స్టే ఇచ్చిందని, కమిషన్ ఏర్పాటును తప్పుపట్టలేదని ఆయన గుర్తు చేశారు. నివేదికలో ఉన్న వాస్తవాలు ఎక్కడికీ పోవని, అవసరమైతే ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కేవలం ఒక కమిషన్ నివేదికపైనే తాము ఆధారపడలేదని, విజిలెన్స్ నివేదికతో పాటు ఎన్డీఎస్ఏ నివేదికలు కూడా తమ వద్ద ఉన్నాయని, తప్పు చేసిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ తీర్పు ఒక హెచ్చరిక లాంటిదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఏదైనా విచారణ జరిపేటప్పుడు చట్టపరమైన నిబంధనలను, నిందితుల హక్కులను పరిగణనలోకి తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయ ఆవేశంలో తీసుకునే నిర్ణయాలు న్యాయస్థానాల ముందు నిలవవని ఈ తీర్పు నిరూపించింది. అయితే దీనిని బీఆర్ఎస్ క్లీన్ చిట్ గా భావించలేమని, కేవలం ప్రక్రియలో ఉన్న లోపాలను మాత్రమే కోర్టు ఎత్తిచూపిందని కాంగ్రెస్ మద్దతుదారులు వాదిస్తున్నారు. ముందున్నది ముసళ్ల పండుగ అని, అసలైన విచారణలో వాస్తవాలు నిగ్గుతేలుతాయని అద్దంకి దయాకర్ వంటి నేతలు వ్యాఖ్యానించడం భవిష్యత్ రాజకీయ ఘర్షణకు సంకేతంగా కనిపిస్తోంది. మరోపక్క కేంద్రం తీరుపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందని ప్రధాని మోదీ నుంచి స్థానిక నేతల వరకు అందరూ విమర్శిస్తారు కానీ, విచారణ విషయంలో మాత్రం అడుగు ముందుకు పడదు.

# రూ.941 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్ సిద్ధం

- **ఎల్బీనగర్ - హయత్‌నగర్ మధ్య 7.1 కి.మీ. డబుల్ డెక్కర్ నిర్మాణం**
- **ఒకే పిల్లర్‌పై హైవే, మెట్రో.. దేశంలోనే రెండో అతిపెద్ద కారిడార్**
- **0 లక్షల మందికి ట్రాఫిక్ విముక్తి; 15 నిమిషాల్లో నగరం దాటొచ్చు**
- **రూ.941 కోట్లు, రాష్ట్ర వాటాగా రూ.200 కోట్లు ఇచ్చేందుకు సీఎం ఓకే**
- **కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి క్లియరెన్స్ తేవాలని మంత్రి నిర్ణయం**
- **పనులు వేగంగా సాగేలా ఒకే ఏజెన్సీకి పనులు అప్పగించాలని ఆదేశం**



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**


హైదరాబాద్ నగరం నలుమూలలా రవాణా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాజధాని నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటైన ఎల్బీ నగర్ నుంచి హయత్ నగర్ వరకు ట్రాఫిక్ కష్టాలను శాశ్వతంగా దూరం చేసేందుకు నిర్మించతలపెట్టిన ప్రతిష్టాత్మక డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పురోగతిపై ఉన్నత స్థాయి సమీక్ష జరిగింది. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. సుమారు 7.1 కిలోమీటర్ల మేర సాగే ఈ భారీ నిర్మాణానికి సంబంధించి సాంకేతిక అంశాలు భూసేకరణ ప్రక్రియపై మంత్రి దిశానిర్దేశం చేశారు. వాహనదారులు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును అత్యంత వేగంగా పట్టాలెక్కించాలని అధికారులను ఆదేశించారు. ఈ కారిడార్ నిర్మాణం పూర్తయితే లక్షలాది మందికి ట్రాఫిక్ నరకం నుంచి విముక్తి లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం జాతీయ రహదారి 65 మార్గంలో ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ ఆల్ ఇండియా రేడియో స్టేషన్ వరకు నిత్యం వాహనాల రద్దీతో ప్రయాణం భారంగా మారుతోంది. ఈ మార్గంలో తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలను అరికట్టి దీనిని పూర్తిస్థాయి యాక్సిడెంట్ ఫ్రీ కారిడార్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించింది. కేవలం స్థానిక రవాణానే కాకుండా విజయవాడ వైపు వెళ్లే దూరప్రాంత వాహనాలకు సైతం ఈ ప్రాజెక్టు ఎంతో మేలు చేయనుంది. నగర శివారు ప్రాంతాల అభివృద్ధికి ఈ భారీ ఫ్లైఓవర్ ఒక చోదక శక్తిలా మారుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. సుమారు 941 కోట్ల రూపాయల భారీ అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంపై మంత్రి కీలక ప్రకటన చేశారు. మొత్తం వ్యయంలో రాష్ట్ర వాటా కింద 200 కోట్ల రూపాయలు కేటాయించేందుకు ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేసినట్లు వెల్లడించారు. నిధుల విషయంలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పనులు పూర్తి చేస్తామన్నారు. ఆర్థిక వనరుల సమీకరణకు సంబంధించి ఇప్పటికే ముసాయిదా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. బడ్జెట్ కేటాయింపులు సకాలంలో జరిగేలా చూడటంతో పాటు పనుల నాణ్యతలో రాజీ పడకుండా నిర్మాణం చేపట్టాలని సూచించారు. నిధుల విడుదల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్థిక శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. మహారాష్ట్రలోని నాగపూర్ తరువాత దేశంలోనే రెండో అతిపెద్ద డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌గా ఇది చరిత్ర సృష్టించబోతోంది. సాంకేతిక పరంగా ఎంతో సంక్లిష్టమైన ఈ నిర్మాణంలో మూడు పొరలుగా రవాణా వ్యవస్థ ఉండటం విశేషం. భూ ఉపరితలంపై సర్వీసు రోడ్డు దాని పైన జాతీయ రహదారి అత్యున్నత భాగంలో మెట్రో రైలు మార్గం ఉండేలా డిజైన్ రూపొందించారు. ఆధునిక ఇంజనీరింగ్ నైపుణ్యంతో నిర్మించే ఈ కారిడార్ హైదరాబాద్ నగర మౌలిక సదుపాయాల రంగంలో ఒక మైలురాయిగా నిలవనుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ నిర్మాణం వల్ల నగర ప్రతిష్ట ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతుందని మంత్రి వివరించారు. దేశంలోనే అత్యుత్తమ రవాణా నమూనాగా దీనిని తీర్చిదిద్దాలని అధికారులను కోరారు. ఈ ప్రాజెక్టు వల్ల ఎల్బీనగర్ హయత్ నగర్ పరిసరాల్లోని 54 కాలనీల్లో నివసించే సుమారు 20 లక్షల మందికి నేరుగా ప్రయోజనం కలుగుతుంది. స్థానికంగా నివసించే ఉద్యోగులు విద్యార్థులు వ్యాపారులు ప్రతిరోజూ ట్రాఫిక్ జామ్‌లో గంటల తరబడి గడపాల్సిన అవసరం ఇకపై ఉండదు. విజయవాడ రహదారిపై ప్రయాణించే వాహనదారులు నగరం వెలుపలికి వెళ్లడానికి పట్టే సమయం గణనీయంగా తగ్గుతుంది. ప్రస్తుతం సుమారు గంట సమయం పట్టే ఈ దూరాన్ని కారిడార్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే కేవలం 15 నిమిషాల్లోనే దాటవచ్చు. ఇంధన ఆదా సమయం ఆదా కావడంతో పాటు కాలుష్యం కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉందని గణాంకాలతో సహా మంత్రి వివరించారు. సాంకేతిక అంశాలపై జరిగిన చర్చలో మంత్రి కీలక సూచనలు చేశారు. డబుల్ డెక్కర్ నిర్మాణం కావడంతో పిల్లర్ల పటిష్టతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఫౌండేషన్లు అత్యంత బలవత్తరంగా ఉండేలా చూడటంతో పాటు విస్తృతమైన స్థలంలో పిల్లర్లు నిర్మించాలని చెప్పారు. భవిష్యత్తులో వాహనాల సాంద్రత మరింత పెరిగినా తట్టుకునే విధంగా డిజైన్ ఉండాలని స్పష్టం చేశారు. మెట్రో రైలు వెళ్లే మార్గంలో వైబ్రేషన్లు వంటి సమస్యలు తలెత్తకుండా శాస్త్రీయంగా పనులు చేపట్టాలని సూచించారు. ఇంజనీరింగ్ నిపుణుల సలహాలు తీసుకుంటూనే స్థానిక భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేయాలని రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.

పనుల వేగం సమన్వయం కోసం ఈ కారిడార్ నిర్మాణాన్ని ఒకే వర్క్ ఏజెన్సీకి అప్పగించాలని ప్రభుత్వం యోచిస్తోంది. రహదారి పనులు మెట్రో పనులు వేర్వేరు సంస్థలు చేపడితే క్షేత్రస్థాయిలో సమస్యలు వస్తాయని మంత్రి అభిప్రాయపడ్డారు. ఒకే సంస్థ ఆధ్వర్యంలో పనులు జరిగితే సమయం ఆదా అవ్వడంతో పాటు నిర్మాణ ప్రక్రియ సమాంతరంగా సాగుతుందని భావిస్తున్నారు. ఏజెన్సీ ఎంపికలో పారదర్శకత పాటిస్తూ అనుభవం ఉన్న సంస్థలకే బాధ్యతలు అప్పగించాలని అధికారులకు సూచించారు. పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దీనివల్ల ప్రతి వారం పురోగతిని సమీక్షించడానికి అవకాశం ఉంటుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

కేంద్ర రవాణా రహదారుల శాఖ నుండి అనుమతులు పొందే ప్రక్రియపై మంత్రి సమీక్షించారు. టెండర్ల ప్రక్రియను త్వరగా ముగించాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టును ఇప్పటికే కేంద్ర వార్షిక ప్రణాళికలో పొందుపరిచినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఎన్‌హెచ్ఏఐ అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ సాంకేతిక ఆమోదాలు పొందాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అందించాల్సిన భూసేకరణ పత్రాలు ఇతర అనుమతులను యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేయాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన అనుమతుల విషయంలో ఎటువంటి జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. ఫైళ్ల కదలికపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ కూడా ఈ ప్రాజెక్టుకు సానుకూలంగా స్పందించడం శుభపరిణామమని మంత్రి పేర్కొన్నారు. మెట్రో విస్తరణలో భాగంగా ఈ మార్గం ఎంతో కీలకం కానుంది. ఎలివేటెడ్ కారిడార్ పైభాగంలో మెట్రో లైన్ నిర్మాణం కోసం హెచ్ఎంఆర్ఎల్ అధికారులు సాంకేతిక అనుమతులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం ఉంటేనే ఇలాంటి భారీ ప్రాజెక్టులు విజయవంతం అవుతాయని మంత్రి చెప్పారు. ఇతర విభాగాల నుంచి వచ్చే అభ్యంతరాలను త్వరితగతిన పరిష్కరించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెట్రో స్టేషన్ల రూపకల్పనలో కూడా ప్రయాణికుల సౌకర్యార్థం మార్పులు చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో ఢిల్లీ పర్యటనలో కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఈ ప్రాజెక్టుకు తక్షణ ఆమోదం తీసుకురావడానికి కృషి చేస్తానని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. వచ్చే వారమే కేంద్ర మంత్రితో సమావేశమై ప్రాజెక్టు ప్రాముఖ్యతను వివరించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర అధికారుల స్థాయిలో పనులన్నీ పూర్తయితే కేంద్రం నుంచి నిధుల విడుదల అనుమతులు త్వరగా వచ్చేలా ఒత్తిడి తీసుకువస్తామన్నారు. నియోజకవర్గాల అభివృద్ధిలో భాగంగా నగర తూర్పు ప్రాంతానికి ఈ ప్రాజెక్టు అద్భుతమైన వరం కానుందని మంత్రి పేర్కొన్నారు. కేంద్రం నుంచి పూర్తి సహకారం అందుతుందన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు.

# ఉద్యోగుల యుద్ధం..!

- **డిమాండ్ల సాధనకై ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళన బాట**
- **52శాతం ఫిట్‌మెంట్, 5 డీఏలు, పాత పెన్షన్ పునరుద్ధరణ**
- **రూ. 13 వేల కోట్ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్**
- **ప్రభుత్వ స్పందన లేనందున నిరాహార దీక్షలకు పిలుపు**
- **ఉద్యోగుల ఆరోగ్య బీమాపై స్పష్టమైన ఉత్తర్వులు కావాలని కోరిక**
- **మే 14న సమావేశమై ఆందోళన ఉధృతిపై జేఏసీ నిర్ణయం**




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర పాలనాయంత్రాంగంలో అసంతృప్తి సెగలు ఒక్కసారిగా రాజుకున్నాయి. మొన్నటి వరకు విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల ఆందోళనలతో సతమతమైన ప్రభుత్వం, ఆ సమస్య ఓ కొలిక్కి వస్తుందన్న ఆశతో ఉండగానే ఆర్టీసీ కార్మిక సంఘాల సమ్మె సైరన్ మోగింది. ఇప్పుడు ఆ సెగ సచివాలయం నుంచి మారుమూల గ్రామీణ కార్యాలయాల వరకు పాకింది. ప్రభుత్వ ఉద్యోగుల గొంతుకగా నిలిచే జేఏసీ తమ నిరసన గళాన్ని విప్పడమే కాకుండా, విధివిధానాలను ఖరారు చేసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సవాల్‌తో కూడిన నోటీసును అందించింది. దీంతో పాలనలో కీలకమైన ఉద్యోగవర్గం ఇప్పుడు ప్రత్యక్ష పోరుబాట పట్టడం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనాన్ని రేకెత్తిస్తోంది. మొత్తం అరవై నాలుగు డిమాండ్లతో కూడిన సుదీర్ఘమైన జాబితాను సిద్ధం చేసుకున్న ఎంప్లాయీస్ జేఏసీ, ప్రస్తుతానికి అత్యంత కీలకమైన ఐదు అంశాలపైనే కేంద్రీకరిస్తోంది. నిన్నటి దాకా ఆశావహ దృక్పథంతో ఉన్న ఉద్యోగ సంఘాలు, క్షేత్రస్థాయిలో అందుతున్న స్పందన చూసి తమ పంథాను మార్చుకున్నాయి. ఇప్పటికే ఒకరోజు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన వేళ, ప్రభుత్వం నుంచి ఏదైనా సానుకూల సంకేతం వస్తుందని ఆశించిన ఉద్యోగులకు నిరాశే ఎదురైంది. అధికార యంత్రాంగం నుంచి స్పష్టమైన హామీ లభించకపోవడంతో, తదుపరి కార్యాచరణలో భాగంగా వచ్చే నెల ఐదో తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో భారీ ఎత్తున నిరాహార దీక్షలు చేపట్టాలని జేఏసీ నిర్ణయించింది. ప్రభుత్వం ముందు ఉంచిన డిమాండ్లలో రెండో పీఆర్సీ నివేదిక అంశం అత్యంత ప్రధానమైనదిగా కనిపిస్తోంది. ప్రస్తుత ధరల పెరుగుదల మరియు జీవన ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం తక్షణమే పీఆర్సీ నివేదికను తెప్పించుకోవాలని ఉద్యోగ సంఘాలు పట్టుబడుతున్నాయి. ముఖ్యంగా యాభై రెండు శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించడం ద్వారా ఉద్యోగుల ఆర్థిక భద్రతకు భరోసా ఇవ్వాలని వారు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపుతున్నప్పటికీ, పెరిగిన పని భారం మరియు నిత్యావసరాల ధరల దృష్ట్యా ఈ స్థాయి వేతన సవరణ అనివార్యమని వారు వాదిస్తున్నారు. జీతాలు, ఇతర ప్రయోజనాల విషయంలో నెలకొన్న స్తబ్దత ఉద్యోగులలో తీవ్ర అసహనానికి దారితీస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఐదు కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని వారు కోరుతున్నారు. గత కొంతకాలంగా డీఏల చెల్లింపులో జరుగుతున్న ఆలస్యం వల్ల మధ్యతరగతి ఉద్యోగుల కుటుంబ బడ్జెట్లు తలకిందులవుతున్నాయి. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ బకాయిల విషయంలో ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయం తీసుకోకపోతే, నిరసనల తీవ్రతను పెంచేందుకు తాము వెనుకాడబోమని జేఏసీ నాయకత్వం హెచ్చరిస్తోంది. రాష్ట్ర ఖజానా నుంచి ఉద్యోగులకు అందాల్సిన బిల్లుల మొత్తం అక్షరాలా పదమూడు వేల కోట్ల రూపాయలకు చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇందులో కేవలం జీతాలు మాత్రమే కాకుండా, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, మరియు జీపీఎఫ్ నిధులు కూడా ఉండటం విశేషం. దశాబ్దాల కాలం పాటు సేవలు అందించి పదవీ విరమణ పొందిన వారు తమ సొంత డబ్బు కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం దురదృష్టకరమని సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఈ భారీ బకాయిలను వెంటనే క్లియర్ చేయకపోతే ఆర్థిక వ్యవస్థపైనే కాకుండా ఉద్యోగుల నైతిక ధైర్యంపై కూడా దెబ్బ పడుతుందని నిపుణులు భావిస్తున్నారు. వైద్య సౌకర్యాల విషయంలోనూ ఉద్యోగులకు భరోసా కరువైంది. ఎంప్లాయీస్ హెల్త్ ఇన్సూరన్స్ స్కీమ్‌కు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడంతో అత్యవసర సమయాల్లో వైద్య సాయం అందక అనేకమంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ పథకంపై తక్షణమే విధివిధానాలు ఖరారు చేసి, నగదు రహిత చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని జేఏసీ పట్టుబడుతోంది. కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, కార్పొరేట్ ఆసుపత్రులలో ఉద్యోగులకు గౌరవప్రదమైన చికిత్స అందేలా యంత్రాంగం పర్యవేక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సమస్యలన్నింటిలోకీ అత్యంత క్లిష్టమైనది, సున్నితమైనది పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ అంశం. ప్రస్తుతం అమలవుతున్న కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ వల్ల తమ భవిష్యత్తు అంధకారమవుతుందని ఉద్యోగ వర్గాలు భయపడుతున్నాయి. దేశవ్యాప్తంగా కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే ఓల్డ్ పెన్షన్ స్కీమ్ వైపు మొగ్గు చూపుతున్న తరుణంలో, తెలంగాణలో కూడా దానిని పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు. పదవీ విరమణ తర్వాత సామాజిక భద్రత కల్పించే పాత విధానమే తమకు శ్రీరామరక్ష అని, దీనిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ లేదా కాంట్రాక్టు సిబ్బంది ఇలా అందరూ ఏకతాటిపైకి వచ్చి ఒకే జేఏసీగా ఏర్పడటం ప్రస్తుత ఉద్యమంలో గమనించదగ్గ పరిణామం. గతంలో వేర్వేరుగా పోరాడిన ఈ వర్గాలన్నీ ఇప్పుడు తమ ఉమ్మడి ప్రయోజనాల కోసం ఐక్యంగా నిలబడ్డాయి. ఈ ఐక్యత ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ప్రతి విభాగానికి తనదైన సమస్యలు ఉన్నప్పటికీ, ప్రధానమైన ఐదు డిమాండ్ల విషయంలో అందరూ ఒకే మాటపై ఉండటం ఉద్యమానికి బలాన్ని చేకూరుస్తోంది.

# బెంగాల్, తమిళనాడులో ఓటర్ల ప్రభంజనం

**విశాలభారతి, జాతీయం:**



తూర్పు భారతం నుంచి దక్షిణ భారతం వరకు ప్రజాస్వామ్య పండగ అత్యంత ఉత్సాహంగా సాగింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు రికార్డు స్థాయిలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బెంగాల్‌లో 91.46 శాతం భారీ పోలింగ్ నమోదు కాగా, తమిళనాడులో 84.41 శాతం మంది ఓటు వేశారు. ఉదయం వేళలో వాతావరణం కొంత మందకొడిగా కనిపించినప్పటికీ, సమయం గడిచేకొద్దీ పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన జనంతో పరిసరాలన్నీ సందడిగా మారాయి. మహిళలు, వృద్ధులు సైతం ఉత్సాహంగా తరలివచ్చి ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములయ్యారు. తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 234 నియోజకవర్గాలకు ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా, సెలబ్రిటీలు, రాజకీయ ఉద్ధండులు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజల్లో చైతన్యం నింపారు. సాయంత్రం 5 గంటల తర్వాత కూడా అనేక చోట్ల ఓటర్లు క్యూలైన్లలో వేచి ఉండటం గమనార్హం. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం గణనీయంగా పెరగడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ప్రజల ఆకాంక్షలు ఎలా ఉన్నాయో మే 4న వెలువడే ఫలితాల ద్వారా స్పష్టం కానుంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మొత్తం 294 నియోజకవర్గాలు ఉండగా, అక్కడ ఉన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా రెండు దశల్లో ఎన్నికలు నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది. తొలి విడతలో భాగంగా నేడు 152 స్థానాలకు పోలింగ్ జరిగింది. మిగిలిన 142 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 29న రెండో విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ రెండు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేసి, మే 4వ తేదీన తుది ఫలితాలను ప్రకటించనున్నారు. బెంగాల్ ఓటర్లు భారీగా తరలిరావడం అక్కడ అధికార, ప్రతిపక్షాల మధ్య సాగుతున్న తీవ్ర పోటీకి నిదర్శనంగా కనిపిస్తోంది. బెంగాల్‌లోని పింగ్లా పట్టణంలో ఒక విచిత్రమైన సంఘటన చోటు చేసుకుంది. పోలింగ్ జరుగుతున్న సమయంలోనే ఒక బూత్‌కు చెందిన సిబ్బంది విధులను వదిలేసి బయటకు వెళ్లడం ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. ఓటు వేసేందుకు వచ్చిన ప్రజలు సిబ్బంది లేకపోవడంతో గందరగోళానికి గురయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న కేంద్ర ఎన్నికల సంఘం వెంటనే స్పందించి బాధ్యులైన అధికారులను, సిబ్బందిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. క్రమశిక్షణారాహిత్యాన్ని ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తూనే, పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక సమర్పించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని ఆదేశించింది. ఎన్నికల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లోని పలు ప్రాంతాల్లో తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. రాజకీయ వర్గాల మధ్య ఉన్న వైషమ్యాలు బహిర్గతమై రణరంగాన్ని తలపించాయి. దక్షిణ దినాజ్‌పూర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ప్రచార వాహనంపై టీఎంసీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో అభ్యర్థి తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకోగా, వాహనం పాక్షికంగా దెబ్బతింది. ఈ దాడిని నిరసిస్తూ బీజేపీ శ్రేణులు ఆందోళనకు దిగడంతో అక్కడ ఉద్రిక్తత పెరిగింది. పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులను చెదరగొట్టాల్సి వచ్చింది. ముర్షిదాబాద్ జిల్లాలో కూడా పరిస్థితి తీవ్రంగా మారింది. టీఎంసీ, ఏయూజేపీ కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణల్లో పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. ఏయూజేపీకి చెందిన ఒక కీలక నేత కారును టీఎంసీ శ్రేణులు ధ్వంసం చేయడంతో గొడవ మరింత ముదిరింది. సమాచారం అందుకున్న వెంటనే అదనపు బలగాలు ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను అక్కడి నుంచి పంపించివేశాయి. పరిస్థితి అదుపు తప్పకుండా ఉండేందుకు పోలీసులు లాఠీచార్జి చేశారు. ఈ గొడవల వల్ల కొంతసేపు పోలింగ్ ప్రక్రియకు ఆటంకం ఏర్పడినప్పటికీ, తర్వాత తిరిగి కొనసాగింది. తమిళనాడు రాష్ట్రంలో పోలింగ్ సరళిని గమనిస్తే, అక్కడ అత్యంత ప్రశాంతమైన వాతావరణం కనిపించింది. ఎక్కడా ఎలాంటి అల్లర్లు గానీ, హింసాత్మక ఘటనలు గానీ నమోదు కాలేదు. అటు గ్రామీణ ప్రాంతాల్లో, ఇటు పట్టణాల్లో ప్రజలు క్రమశిక్షణతో ఓటు వేశారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు సైతం సహకరించుకోవడంతో ఎన్నికల సిబ్బందికి పని సులువైంది. భారీగా మోహరించిన భద్రతా బలగాల పహారాలో ఓటర్లు స్వేచ్ఛగా తమ ప్రతినిధులను ఎన్నుకునేందుకు మొగ్గు చూపారు. దక్షిణాది రాష్ట్రాల్లోని రాజకీయ పరిణతికి ఈ పోలింగ్ ఒక నిదర్శనంగా నిలిచింది. మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్ శాతం సాధారణంగా ఉన్నప్పటికీ, ఎండ తీవ్రత తగ్గాక జనం పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. ముఖ్యంగా యువ ఓటర్లు సామాజిక మాధ్యమాల్లో సెల్ఫీలు పెడుతూ ఇతరులను ప్రోత్సహించడం కనిపించింది. ఎన్నికల సంఘం కల్పించిన కనీస వసతులు, తాగునీరు వంటి సౌకర్యాలు ఓటర్లకు ఊరటనిచ్చాయి. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్న ప్రచారం క్షేత్రస్థాయిలో బాగా పని చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. 84 శాతానికి పైగా పోలింగ్ నమోదు కావడం తమిళనాడు రాజకీయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుంది. బెంగాల్ రెండో విడత ఎన్నికల కోసం అప్పుడే రాజకీయ పక్షాలు సిద్ధమవుతున్నాయి. మిగిలిన 142 స్థానాల్లో పట్టు సాధించేందుకు అగ్రనేతలు పర్యటనలు ఖరారు చేసుకున్నారు. మొదటి దశలో జరిగిన అల్లర్లను దృష్టిలో ఉంచుకుని, రెండో దశలో మరింత కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం యోచిస్తోంది. సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాల మోహరింపును పెంచే అవకాశం ఉంది. ప్రజాస్వామ్య విలువలు కాపాడేలా అభ్యర్థులు, పార్టీలు సంయమనం పాటించాలని అధికారులు కోరుతున్నారు. గణాంకాల విశ్లేషణ ప్రకారం, బెంగాల్‌లో పోలింగ్ శాతం గత ఐదేళ్ల సగటును మించిపోయింది. 91.46 శాతం అంటే దాదాపుగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు వేసినట్లే లెక్క. ఇది అధికార పక్షానికి అనుకూలమా లేక వ్యతిరేక పవనమా అనే చర్చలో విశ్లేషకులు మునిగిపోయారు. మార్పు కోరుకునే వారు పెద్ద ఎత్తున తరలివచ్చారా లేక తమ పట్టును నిరూపించుకునేందుకు కేడర్ కదిలిందా అనేది ఫలితాల రోజున తేలనుంది. తమిళనాడులో సైతం 84 శాతం పోలింగ్ అంటే పాత రికార్డులు కనుమరుగు కావడం ఖాయంగా కనిపిస్తోంది. అన్ని కళ్లు ఇప్పుడు మే 4వ తేదీపైనే ఉన్నాయి.

# క్యాబినెట్‌ను టెన్షన్ పెట్టిన ఆర్టీసీ సమ్మె

- ఆత్మాహుతి యత్నాలతో ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వం కలవరం
- క్యాబినెట్ అజెండా పక్కనపెట్టి సమ్మెపైనే మంత్రుల సుదీర్ఘ భేటీ
- అఘాయిత్యాలకు పాల్పడవద్దని కార్మికులకు నలుగురు మంత్రుల విజ్ఞప్తి
- పరిష్కారం కోసం యూనియన్లతో డిప్యూటీ సీఎం భట్టి చర్చలు
- ఆత్మహత్యలు సమ్మెను ఉధృతం చేస్తాయని ప్రభుత్వం ఆందోళన
- సచివాలయ భేటీలోనే సమస్య కొలిక్కి వస్తుందని సర్కార్ ఆశ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర రాజకీయ యవనికపై ఇప్పుడు ఆర్టీసీ కార్మికుల సమ్మె సెగలు రేపుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను ఏ స్థాయిలో తీవ్రంగా పరిగణిస్తోందో గురువారం నాటి క్యాబినెట్ పరిణామాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో సమ్మె అంశం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రభుత్వ అజెండాలో ఉన్న ఇతర అంశాలను పక్కన పెట్టి మరీ మంత్రుల బృందం ఈ వ్యవహారంపై సుదీర్ఘంగా మథనం చేయడాన్ని గమనిస్తే, అధికార యంత్రాంగం ఏ స్థాయిలో ఉక్కిరిబిక్కిరి అవుతోందో ఇట్టే అర్థమవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకే అంశంపై చర్చ ముగిసిన వెంటనే ఏకంగా నలుగురు మంత్రులు రంగంలోకి దిగడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. క్యాబినెట్ సమావేశం ముగిసిన తక్షణమే ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుతో పాటు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేకంగా మీడియా ముందుకు రావడం రాష్ట్ర చరిత్రలో అరుదైన ఘట్టంగా నిలిచింది. సాధారణంగా ప్రభుత్వ నిర్ణయాలను ఒకరో ఇద్దరో మంత్రులు వివరించడం ఆనవాయితీగా వస్తోంది. కానీ ఈసారి నలుగురు మంత్రులు ఏకతాటిపైకి వచ్చి మీడియా సమావేశం నిర్వహించడం వెనుక ఉన్న ఆంతర్యం కేవలం సమాచార చేరవేత మాత్రమే కాదు, పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతను, కార్మిక ఆగ్రహాన్ని చల్లార్చాలనే వ్యూహంగా కనిపిస్తోంది. ప్రభుత్వ పెద్దల ముఖాల్లో స్పష్టంగా కనిపిస్తున్న ఆందోళన వారి మాటల్లోనూ ప్రతిధ్వనించింది. ప్రభుత్వంలో ఇంతటి కలవరం మొదలవ్వడానికి కేవలం సమ్మె పిలుపు మాత్రమే కారణం కాదు. ఆర్టీసీ కార్మికుల ఆవేదన ఆత్మబలిదానాల దిశగా మళ్లడం సచివాలయ గోడలను సైతం వణికించింది. వరంగల్ జిల్లా నర్సంపేట డిపోకు చెందిన కోలా శంకర్ గౌడ్ ఆత్మహత్యాయత్నం ఉదంతం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. తన శరీరంపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకోవడానికి సిద్ధపడటం సమ్మె తీవ్రతను కళ్లకు కట్టినట్లు చూపించింది. ఈ వార్త బయటకు రాగానే పాలకపక్షంలో ఆందోళన రేకెత్తింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులు చేయి దాటుతున్నాయని భావించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తక్షణమే పరిస్థితిని సమీక్షించి కార్మికులను అనునయించే దిశగా అడుగులు వేశారు. దురదృష్టవశాత్తు ఆత్మహత్యాయత్నాలు అక్కడితో ఆగలేదు. నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడ డిపోలో వెంకన్న అనే కార్మికుడు డీజిల్ పోసుకుని ప్రాణత్యాగానికి సిద్ధమవడం, అలాగే నర్సంపేటలో శంకర్ గౌడ్ ఘటన తరహాలోనే మరో కార్మికుడు ఆవేదన చెందడం వంటి వార్తలు ప్రభుత్వానికి నిద్రలేకుండా చేశాయి. ఈ మూడు ఘటనల తాలూకు పూర్తి సమాచారం క్యాబినెట్ భేటీ మధ్యలోనే మంత్రులకు చేరడంతో చర్చల దిశ ఒక్కసారిగా మారిపోయింది. ఈ విపత్కర పరిస్థితులు చివరకు శాంతి భద్రతల సమస్యగా పరిణమించే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ నివేదికలు కూడా హెచ్చరించడంతో, ప్రభుత్వం రక్షణ ధోరణిని వీడి చర్చల బాట పట్టక తప్పని పరిస్థితి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50,000 మంది ఆర్టీసీ కార్మికులు, వారి కుటుంబాల ఆక్రందన ఇప్పుడు ప్రభుత్వం చుట్టూ ముసురుకుంది. సుమారు 10,000 బస్సులు డిపోలకే పరిమితమైతే సామాన్య ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులు ఎన్నికల వేళ రాజకీయంగా పెద్ద దెబ్బ అవుతాయని రేవంత్ సర్కార్ భావిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన సమ్మె అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి సమస్యను జటిలం చేయకుండా పరిష్కరించాలని ముఖ్యమంత్రి మంత్రులకు గట్టిగా దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. అందుకే ప్రతిపక్షాలకు విమర్శించే అవకాశం ఇవ్వకుండానే ప్రభుత్వం తానే స్వయంగా చర్చలకు ఆహ్వానం పలికింది. ఈ పరిణామాల నేపథ్యంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు. ఆర్టీసీ యూనియన్ల డిమాండ్ల పరిష్కారం కోసం శుక్రవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరగనుంది. ఆర్థిక పరమైన అంశాలు ముడిపడి ఉన్నందున ఆర్థిక మంత్రి హోదాలో భట్టి విక్రమార్క రంగంలోకి దిగడం ఈ చర్చలకు ఉన్న ప్రాధాన్యతను పెంచుతోంది. యూనియన్ నేతలు ఈ సమావేశానికి హాజరై తమ సమస్యలను విన్నవించాలని ప్రభుత్వం అధికారికంగా ఆహ్వానించింది. చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని, కార్మికులు సహనంతో వ్యవహరించాలని ప్రభుత్వం కోరుతోంది. కార్మికుల ప్రధాన డిమాండ్లలో ముఖ్యంగా వేతన సవరణ, పెండింగ్‌లో ఉన్న డీఏల చెల్లింపు, సంస్థను ప్రభుత్వం పూర్తిగా ఆదుకోవడం వంటి అంశాలు ఉన్నాయి. ప్రస్తుతం సంస్థపై ఉన్న రుణభారం వేల కోట్ల రూపాయల్లో ఉంది. ప్రతి నెలా జీతాల కోసం సుమారు 250 కోట్ల రూపాయలు అవసరమవుతున్నాయి. ఇటువంటి ఆర్థిక ఇబ్బందుల నడుమ కార్మికుల డిమాండ్లను ఏ మేరకు నెరవేరుస్తారనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అయినప్పటికీ ప్రభుత్వం చాలా సానుకూలంగా ఉందని, ప్రతి కార్మికుడి కష్టాన్ని ప్రభుత్వం గుర్తిస్తుందని మంత్రులు భరోసా ఇస్తున్నారు. ప్రజా రవాణా వ్యవస్థ స్తంభిస్తే సామాన్యుడి జీవనం అస్తవ్యస్తమవుతుందని మంత్రులు తమ బ్రీఫింగ్‌లో పదే పదే గుర్తు చేశారు. కార్మికులు ఎవరూ కూడా అనాలోచిత నిర్ణయాలు తీసుకుని తమ ప్రాణాలను పణంగా పెట్టవద్దని, కుటుంబాలను రోడ్డున పడేయవద్దని ప్రభుత్వం పక్షాన విజ్ఞప్తి చేశారు. ఆత్మహత్యాయత్నాలకు పాల్పడటం వల్ల సమస్య పరిష్కారం కాదని, కేవలం ఉద్రిక్తతలు పెరుగుతాయని మంత్రులు దామోదర రాజనరసింహ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సానుకూలతను గమనించి సమ్మె విరమించే దిశగా ఆలోచించాలని వారు కోరారు. మరోవైపు ఆర్టీసీ యూనియన్లు మాత్రం ప్రభుత్వ ప్రకటనల పట్ల మిశ్రమ స్పందన వ్యక్తం చేస్తున్నాయి. చర్చలకు వెళ్లడానికి సిద్ధమైనప్పటికీ, కేవలం హామీలతో సరిపెడితే ఊరుకోబోమని వారు హెచ్చరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో కార్మికుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందని, ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేసి తమ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గతంలో కూడా ఇటువంటి చర్చలు జరిగాయని, కానీ ఫలితాలు ఆశించిన స్థాయిలో లేవనే అపనమ్మకం కార్మికుల్లో ఉండటం గమనార్హం. నేడు జరగబోయే భట్టి విక్రమార్క సమావేశం తెలంగాణ రాజకీయాల్లో అత్యంత కీలకం కానుంది. ఒకవేళ చర్చలు విఫలమైతే సమ్మె మరింత ఉధృతం అయ్యే అవకాశం ఉంది. ప్రతిపక్షాలు కూడా ఈ అంశాన్ని రాజకీయ అస్త్రంగా మార్చుకోవాలని చూస్తున్నాయి. అధికార పక్షం ఈ సంక్షోభం నుండి ఎలా బయటపడుతుందో చూడాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పరిస్థితులను నిశితంగా గమనిస్తుండటం, మంత్రులు వరుసగా విజ్ఞప్తులు చేయడం ప్రభుత్వంలో నెలకొన్న ఆందోళనను కచ్చితంగా ప్రతిబింబిస్తోంది. ఆర్టీసీ చక్రాన్ని మళ్లీ పరుగులు తీయించే బాధ్యత ఇప్పుడు అటు ప్రభుత్వం, ఇటు యూనియన్ల చేతుల్లో ఉంది. కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పిస్తూ, వారి న్యాయమైన డిమాండ్లను తీరిస్తేనే ఈ సమ్మెకు శాశ్వత ముగింపు లభిస్తుంది. రేపటి సచివాలయ చర్చలు కేవలం మాటలకే పరిమితం అవుతాయా లేక ఆచరణలో చేతల వరకు వెళ్తాయా అన్నది వేచి చూడాలి. రాష్ట్ర ప్రజలంతా ఇప్పుడు సచివాలయం వైపే ఆశగా చూస్తున్నారు. సమ్మె సెగలు చల్లారి బస్సుల హారన్ మళ్లీ మోగాలని అందరూ కోరుకుంటున్నారు.

# ఆర్టీసీతో పెట్టుకుంటే కేసీఆర్ పరిస్థితే

మొదటిపేజీ తరువాయి

ఉద్యోగులుగా గుర్తించాలనే డిమాండ్‌తో దశాబ్దాల తరబడి వీరోచిత పోరాటాలు సాగాయని ఆయన గుర్తుచేశారు. ఆనాడు జరిగిన ఎన్నో ఉద్యమాలు పాలకుల మొండివైఖరి కారణంగా ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ వేదికగా గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడారు. గత ప్రభుత్వం 2023 సంవత్సరంలో ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నియామక పత్రాలు అందజేసి కార్మికులను పూర్తి స్థాయి ప్రభుత్వ ఉద్యోగులుగా మారుస్తుందని అందరూ ఆశించారని తెలిపారు. దురదృష్టవశాత్తు అటువంటి సానుకూల పరిస్థితులు కనిపించకపోవడంతోనే విధిలేక ఆర్టీసీ కార్మికులు నేడు సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని ఆయన విశ్లేషించారు. రాష్ట్రంలో అధికార మార్పిడి కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అసాధ్యమైన హామీలను గుప్పించిందని ఈటల రాజేందర్ విమర్శించారు. గద్దెనెక్కిన తర్వాత ఇచ్చిన వాగ్దానాల అమలును హస్తం పార్టీ నేతలు పూర్తిగా విస్మరించారని ఆయన ఎద్దేవా చేశారు. స్వరాష్ట్రం సిద్ధించిన తొలినాళ్లలో సుమారు 60,000 మంది ఉద్యోగులతో కళకళలాడిన ఆర్టీసీ సంస్థ నేడు కేవలం 38,000 మంది సిబ్బందికి పరిమితం కావడం శోచనీయమని పేర్కొన్నారు. ఇదే ధోరణి కొనసాగితే రాబోయే మరో పదేళ్ల కాలంలో ఆర్టీసీలో ఉద్యోగులనే వారు లేకుండా చేసి సంస్థను పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల పరం చేసే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నగరాల్లో పెరుగుతున్న కాలుష్య నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని ప్రోత్సహిస్తోందని ఎంపీ తెలిపారు. పర్యావరణ హిత రవాణా కోసం కేంద్రం ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నులను సైతం రద్దు చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కేంద్రం కల్పిస్తున్న ఈ వెసులుబాటును వినియోగించుకోకుండా ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను భారీ ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. ఆ బస్సుల్లో పనిచేసే సిబ్బందిని కూడా ప్రైవేటు ఏజెన్సీల ద్వారానే నియమించడం వల్ల కార్మికుల ఉపాధి భద్రతకు విఘాతం కలుగుతోందని ఆయన ఘాటుగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను ఆర్టీసీ సంస్థే నేరుగా స్వీకరించాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుతో పాటు వాటి నిర్వహణ బాధ్యతలను కూడా సంస్థే చేపట్టాలని సూచించారు. ప్రైవేటు ఆపరేటర్ల జోక్యం పెరగడం వల్ల ఆర్టీసీ అస్తిత్వానికే ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ విధానపరమైన లోపాల కారణంగానే సంస్థ ఆర్థికంగా దిగజారి అప్పుల ఊబిలో కూరుకుపోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన పాలకులు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం వల్ల సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన వెల్లడించారు. ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రెండు వేతన సవరణ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోవడం వల్ల కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని తెలిపారు. గత పాలనలో కేసీఆర్ కూడా కార్మిక సంఘాల ఉనికిని ప్రశ్నిస్తూ సమ్మెల అవసరం లేదంటూ వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. ఆనాడు కేసీఆర్ వైఖరిని తప్పుబట్టిన కాంగ్రెస్ పార్టీ నేతలు నేడు అధికారంలోకి వచ్చాక అదే బాటలో నడుస్తున్నారని మండిపడ్డారు. పాలకుల తీరు మారినా కార్మికుల కష్టాలు మాత్రం తీరడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. సంస్థలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు ఎదుర్కొంటున్న పని ఒత్తిడిని ప్రభుత్వం గుర్తించాలన్నారు. మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చిన తర్వాత బస్సుల్లో ప్రయాణికుల రద్దీ అనూహ్యంగా పెరిగిందని గణాంకాలతో వివరించారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను, సిబ్బందిని పెంచకపోవడం వల్ల ఉన్న వారిపై అదనపు భారం పడుతోందని ఆవేదన చెందారు. ఉచిత ప్రయాణ సౌకర్యం వల్ల సంస్థకు కలుగుతున్న ఆర్థిక నష్టాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని కోరారు. కార్మికులకు చెల్లించాల్సిన అలవెన్సులు, ఇతర ప్రయోజనాలు సకాలంలో అందడం లేదని ఆయన ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ ఆస్తులను కాపాడటంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఈటల రాజేందర్ ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ భూములు, భవనాలను వాణిజ్య అవసరాల పేరుతో ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. వేల కోట్ల విలువైన భూములను కారుచౌకగా లీజుకు ఇవ్వడం వల్ల సంస్థకు రావాల్సిన ఆదాయానికి గండి పడుతోందని పేర్కొన్నారు.



# ఆర్టీసీకి రోజూ 17 కోట్ల లాస్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరుకోవడంతో ప్రజా రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలన్న ప్రధాన డిమాండ్లతో కార్మికులు పోరాట బాట పట్టారు. రాష్ట్రంలోని అన్ని డిపోల ఎదుట కార్మికులు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన కూడళ్లలో ప్రైవేట్ వాహనాల కోసం జనం పడిగాపులు కాస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. కార్మికుల పంతం, ప్రభుత్వ మొండివైఖరి మధ్య సామాన్య జనం నలిగిపోతున్నారు. నర్సంపేటలో చోటుచేసుకున్న ఒక విషాద ఘటన సమ్మె తీవ్రతను ఒక్కసారిగా పెంచింది. తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలంటూ ఆందోళన చేస్తున్న ఒక ఆర్టీసీ డ్రైవర్ ఆవేదనతో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకున్నారు. కళ్లముందే సహచర కార్మికుడు మంటల్లో కాలిపోతుంటే అక్కడున్న వారు నిర్ఘాంతపోయారు. తీవ్ర గాయాలైన సదరు డ్రైవర్‌ను వెంటనే వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు ప్రాథమిక సమాచారం అందించారు. ఈ ఘటనతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పరిస్థితి భయానకంగా మారింది. కార్మికులు ఆగ్రహంతో రోడ్లపైకి వచ్చి నిరసనలు ఉధృతం చేయడంతో పోలీసు బలగాలను భారీగా మోహరించారు. సమ్మె కారణంగా ఆర్టీసీ సంస్థకు ఆర్థికంగా భారీ గండం పొంచి ఉంది. నిన్న ఒక్కరోజే సంస్థకు దాదాపు 17 కోట్లకు పైగా ఆదాయం గండి పడింది. సాధారణ రోజుల్లో కోట్లల్లో ఉండే టికెట్ల అమ్మకాలు నిన్న కేవలం 3.22 కోట్లకు మాత్రమే పరిమితమయ్యాయి. వరంగల్ వంటి అతిపెద్ద రీజియన్‌ను పరిశీలిస్తే అక్కడ ప్రతిరోజూ సుమారు రెండు కోట్లకు పైగా రాబడి రావాల్సి ఉండగా అది కేవలం కొన్ని లక్షలకే పరిమితం కావడం సంస్థ దయనీయ స్థితిని ప్రతిబింబిస్తోంది. దాదాపు 6500 సొంత బస్సులు డిపోల నుంచి బయటకు రాకుండా లోపలే ఉండిపోయాయి. అధికారులు 11 అద్దె బస్సులను నడిపించే ప్రయత్నం చేసినా అవి ప్రయాణికుల అవసరాలను తీర్చలేకపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా అరకొరగా నడుస్తున్న వాహనాల వల్ల రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిన్నటి నుంచి ఇప్పటివరకు మొత్తం 34 ప్రమాదాలు చోటుచేసుకున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. అనుభవం లేని డ్రైవర్లతో బస్సులు నడిపించడం వల్లనే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రమాదాల్లో అనేక బస్సులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. విలువైన ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం కావడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. అటు ప్రాణనష్టం, ఇటు ఆస్తి నష్టం సంభవిస్తుండటంతో ప్రయాణికులు బస్సు ఎక్కాలంటేనే జంకుతున్నారు. సురక్షిత ప్రయాణానికి మారుపేరైన ఆర్టీసీ ఇప్పుడు ప్రమాదాలకు నెలవుగా మారిందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రజా రవాణా ఇబ్బందులను ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీలు దోపిడీకి తెరలేపాయి. ప్రయాణికుల రద్దీని బట్టి చార్జీలను అమాంతం పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నాయి. సాధారణ చార్జీల మీద అదనంగా 50 శాతం వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. ముఖ్యంగా అంతరాష్ట్ర సర్వీసుల్లో ఈ దోపిడీ మరీ ఎక్కువగా ఉంది. వేసవి కాలం కావడంతో ప్రజలు విధిలేక ఏసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. దీన్ని అదనుగా చూసుకుని ప్రైవేట్ ఆపరేటర్లు ఇష్టానుసారంగా ధరలు నిర్ణయిస్తున్నారు. హైదరాబాద్ నుంచి ఇతర జిల్లాలకు వెళ్లే వారి పరిస్థితి మరీ అగమ్యగోచరంగా మారింది. ప్రైవేట్ దోపిడీని అరికట్టడంలో రవాణా శాఖ విఫలమైందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలంగాణలో సమ్మె ప్రభావం పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీకి కాసుల వర్షం కురిపిస్తోంది. ఇక్కడి బస్సులు నడవకపోవడంతో ఏపీ ఆర్టీసీ తన సర్వీసులను పెంచి లాభాలను వెనకేసుకుంటోంది. ముఖ్యంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ వంటి నగరాల నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు ఏపీ బస్సులు నిరంతరాయంగా తిరుగుతున్నాయి. తెలంగాణ ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల కంటే ఏపీ ఆర్టీసీ బస్సులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో ఆ రాష్ట్ర సంస్థకు ఆదాయం దండిగా వస్తోంది. మన రాష్ట్ర కార్మికులు సమ్మెలో ఉంటే పక్క రాష్ట్ర సంస్థ పండుగ చేసుకోవడం గమనార్హం. సరిహద్దు ప్రాంతాల్లో ఏపీ బస్సులు కిక్కిరిసి ప్రయాణిస్తున్నాయి. ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థలు కూడా తమ సర్వీసులను రెట్టింపు చేశాయి. ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా అదనపు ట్రిప్పులు నడుపుతున్నాయి. రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల వద్ద ప్రైవేట్ వాహనాల హడావుడి కనిపిస్తోంది. చార్జీల పెంపుతో పాటు సీట్ల కోసం ప్రయాణికుల మధ్య పోటీ ఏర్పడింది. చిన్న చిన్న దూరాలకు కూడా అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ ఆపరేటర్ల మధ్య ఉన్న సిండికేట్ వల్ల సామాన్యులకు ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాల యజమానులు భారీగా లాభాలను గడిస్తున్నారు. సమ్మెను విరమింపజేసేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఇప్పటివరకు విఫలమయ్యాయి. కార్మికులతో జరిపిన చర్చలు ఏవీ సత్ఫలితాలను ఇవ్వలేదు. ప్రభుత్వం కార్మికుల డిమాండ్లను గొంతెమ్మ కోరికలుగా అభివర్ణిస్తోంది. సంస్థ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్న తరుణంలో విలీనం వంటి పెద్ద నిర్ణయాలు తీసుకోవడం సాధ్యం కాదని ప్రభుత్వ పెద్దలు స్పష్టం చేస్తున్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశంపై కూడా ప్రభుత్వం మొండిగానే ఉంది. దశలవారీగా బకాయిలు చెల్లిస్తామన్న ప్రతిపాదనను కార్మికులు తిరస్కరించారు. ఒకేసారి అన్ని సమస్యలు పరిష్కారం కావాలని జేఏసీ పట్టుబడుతోంది. ఆర్టీసీ జేఏసీ నాయకులు తమ డిమాండ్ల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు నిరసనలు కొనసాగిస్తామని ప్రకటించారు. ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కార్మికుల ఐక్యతను దెబ్బతీయాలని ప్రభుత్వం చూస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నర్సంపేట ఘటన తర్వాత కార్మికుల్లో భావోద్వేగాలు పెరిగాయి. తమ ప్రాణాలను పణంగా పెట్టి అయినా సరే సంస్థను కాపాడుకుంటామని వారు శపథం చేస్తున్నారు. ప్రతి డిపో వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో శాంతిభద్రతల సమస్య తలెత్తుతోంది. ప్రభుత్వ వర్గాలు మాత్రం సమ్మెపై కఠినంగా వ్యవహరించాలని యోచిస్తున్నాయి. ప్రత్యామ్నాయ డ్రైవర్లను నియమించుకుని బస్సులను నడిపించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. సమ్మెలో పాల్గొంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. చర్చలకు ద్వారాలు తెరిచే ఉన్నాయని చెబుతూనే కార్మికులపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఆర్టీసీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రభుత్వం అంటోంది. ఆర్థిక భారాన్ని మోయలేని స్థితిలో ఉన్న సంస్థకు కార్మికులు సహకరించాలని కోరుతోంది. ప్రస్తుతానికి రెండు వర్గాల మధ్య సయోధ్య కుదిరే సూచనలు కనిపించడం లేదు. భవిష్యత్తులో ఈ సమ్మె ఎటు దారితీస్తుందో అన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. రెండో రోజు ముగిసే సమయానికి కూడా పరిష్కారం లభించకపోవడంతో రేపు కూడా బస్సులు నడిచే అవకాశం కనిపించడం లేదు. సామాన్య జనం తమ ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు. అత్యవసర పనుల మీద వెళ్లే వారు ఆర్థికంగా చితికిపోతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మధ్యేమార్గంగా సమస్యను పరిష్కరించాలని మేధావులు కోరుతున్నారు. లేని పక్షంలో రాష్ట్ర రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ఇరు వర్గాలు మెట్టు దిగాలని జనం ఆశిస్తున్నారు.




# బలి దానాల దిశగా ఆర్టీసీ సమ్మె

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బుధవారం తెల్లవారుజాము నుంచే ప్రారంభమైన ఈ ఆందోళనలు గురువారం నాటికి ఉగ్రరూపం దాల్చడం గమనార్హం. నర్సంపేట బస్ డిపో వద్ద కార్మికులు పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్న సమయంలో, డ్రైవర్ శంకర్ గౌడ్ ఒక్కసారిగా తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకున్నారు. ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న ప్రధాన డిమాండ్‌ను పక్కన పెట్టడం దారుణమని ఆక్రోశిస్తూ ఆయన ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. చూస్తుండగానే మంటలు చెలరేగడంతో తోటి కార్మికులు హతాశులయ్యారు. మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే ఆయన శరీరం దాదాపు తొంభై శాతం మేర కాలిపోయిందని వైద్య వర్గాలు ధృవీకరించాయి. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన సమాచారం కార్మికుల్లో కార్చిచ్చులా వ్యాపించి ఆందోళనలు మరింత తీవ్రమయ్యేలా చేసింది. ప్రభుత్వ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం, ఆర్టీసీ కార్మికులు మొత్తం 32 డిమాండ్లను రవాణా శాఖ ముందు ఉంచారు. వీటిపై సుదీర్ఘంగా చర్చలు జరిపిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇందులో ఇరవై తొమ్మిది అంశాలను పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. అయితే అత్యంత కీలకమైన ఆర్టీసీ విలీనం, వేతన సవరణ వంటి అంశాలపై స్పష్టమైన హామీ లభించకపోవడంతో కార్మికులు తమ పట్టు వీడటం లేదు. మంత్రి ప్రకటనలో పస లేదని, ప్రధాన డిమాండ్లను పక్కదారి పట్టించేందుకే ఈ విధమైన ప్రకటనలు చేస్తున్నారని కార్మిక సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. సమ్మె విరమించే ప్రసక్తే లేదని, ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం సాగిస్తామని వారు భీష్మించుకుని కూర్చున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని గమనిస్తే రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. కార్మికులు విధులను బహిష్కరించడంతో డిపోలన్నీ వెలవెలబోతున్నాయి. ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ డ్రైవర్లు, కండక్టర్లతో బస్సులను నడిపించాలని చూస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అది సఫలం కావడం లేదు. ప్రస్తుతం కేవలం ఐదు శాతం బస్సు సర్వీసులు మాత్రమే నామమాత్రంగా నడుస్తున్నాయి. ఆ కొద్దిపాటి బస్సులను కూడా కార్మికులు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ, తమ భవిష్యత్తు కోసం ఈ పోరాటం తప్పనిసరని కార్మికులు వాదిస్తున్నారు. రవాణా స్తంభించడంతో సామాన్య జనం ఆటోలు, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో ప్రైవేట్ వాహనదారులు చార్జీలను అడ్డగోలుగా పెంచేసి ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతున్నారు. ఇంటెలిజెన్స్ వర్గాలు సైతం ఈ సమ్మె గమనాన్ని నిశితంగా గమనిస్తున్నాయి. నర్సంపేట ఘటన తర్వాత కార్మికుల్లో ఆవేశం కట్టలు తెంచుకునే అవకాశం ఉందని, ఇది శాంతిభద్రతల సమస్యగా మారే ప్రమాదం ఉందని హెచ్చరికలు జారీ చేశాయి. ప్రతి డిపో వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించినప్పటికీ, కార్మికుల ఐక్యత ముందు ప్రభుత్వ యంత్రాంగం నిస్సహాయంగా కనిపిస్తోంది. పోలీసులు రక్షణ కవచంలా నిలిచి బస్సులను బయటకు పంపే ప్రయత్నం చేస్తుంటే, కార్మికులు ప్రాణాలకు తెగించి టైర్ల కింద పడుతూ అడ్డుకుంటున్నారు. ఇలాంటి ఉద్వేగభరితమైన వాతావరణం గతంలో ఎన్నడూ చూడలేదని సీనియర్ అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వం మొండితనాన్ని వీడి చర్చలకు పిలవాలని ప్రతిపక్ష పార్టీలు కూడా ఒత్తిడి పెంచుతున్నాయి. శంకర్ గౌడ్ ఆత్మాహుతి యత్నం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని వారు విమర్శిస్తున్నారు. కార్మికుల పొట్ట కొట్టే చర్యలను మానుకోవాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపుతూ ప్రభుత్వం తాత్సారం చేస్తుంటే, మరోవైపు ప్రాణత్యాగాలకు సిద్ధపడుతున్న కార్మికులు పాలక పక్షానికి సవాలుగా మారారు. ఈ ఘర్షణ వాతావరణం వల్ల సామాన్య ప్రజానీకం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు గమ్యస్థానాలకు చేరలేక అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లలో ముఖ్యమైనది సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడం. దీనివల్ల తమకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానమైన హోదా, భద్రత లభిస్తాయని వారు భావిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం దీనివల్ల ఖజానాపై పడే అదనపు భారాన్ని భరించలేమని సంకేతాలిస్తోంది. ఈ వైరుధ్యమే ఇప్పుడు ఉద్రిక్తతలకు కేంద్ర బిందువైంది. 2019 నాటి సమ్మె అనుభవాలను దృష్టిలో ఉంచుకుని కార్మికులు ఈసారి మరింత పకడ్బందీగా తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. నర్సంపేట డ్రైవర్ ఘటనతో ఇప్పుడు కార్మిక లోకంలో ఒక రకమైన భావోద్వేగపూరిత వాతావరణం నెలకొంది. ఇది సమ్మెను మరింత కాలం కొనసాగించేలా చేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లాల వారీగా నిరసనలను పరిశీలిస్తే, ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నల్గొండ జిల్లాల్లో సమ్మె ప్రభావం అత్యధికంగా ఉంది. అక్కడ కార్మికులు రోడ్లపైనే వంటా వార్పు కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ నిరసన గళాన్ని వినిపిస్తున్నారు. డ్రైవర్ శంకర్ గౌడ్ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడన్న వార్త విన్న కార్మికులు డిపోల వద్ద కన్నీటి పర్యంతమవుతున్నారు. ఒక సామాన్య డ్రైవర్ ప్రాణత్యాగానికి సిద్ధపడటం అంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో కూడా కార్మికుల సమ్మెకు మద్దతు పెరుగుతోంది. హ్యాష్ ట్యాగ్‌లతో ప్రభుత్వ తీరును నెటిజన్లు ఎండగడుతున్నారు. మరోవైపు అధికారులు మాత్రం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ముమ్మరం చేశామని చెబుతున్నారు. తాత్కాలిక సిబ్బందితో వీలైనన్ని ఎక్కువ సర్వీసులను పునరుద్ధరిస్తామని హామీ ఇస్తున్నారు. అయితే అనుభవం లేని డ్రైవర్లతో బస్సులు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కేవలం ఐదు శాతం బస్సులు మాత్రమే రోడెక్కడం అంటే రవాణా వ్యవస్థ ఎంతగా కుదేలైందో ఇట్టే తెలుస్తోంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మిక సంఘాలతో చర్చలు జరపకపోతే, ఈ ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లకు దారితీసే సూచనలు కనిపిస్తున్నాయి. అటు పోలీసులు కూడా ఏ చిన్న అవాంఛనీయ ఘటన జరగకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ సమాజం ఇప్పుడు ఈ సమస్య పరిష్కారం కోసం ఎదురుచూస్తోంది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించిన పరిష్కారాలు కార్మికులకు నమ్మకాన్ని కలిగించడంలో విఫలమయ్యాయి. కార్మికులు కోరుతున్న ఇరవై తొమ్మిది డిమాండ్లు కాకుండా, ఆ మూడు కీలక డిమాండ్లే ఈ పోరాటానికి ఆయువు పట్టుగా నిలిచాయి. ప్రభుత్వం తన పంతాన్ని వీడి, మానవతా దృక్పథంతో ఆలోచించి, కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా నిర్ణయం తీసుకోవాలని మేధావులు సూచిస్తున్నారు. లేనిపక్షంలో శంకర్ గౌడ్ వంటి వారు మరికొందరు త్యాగాలకు సిద్ధపడితే పరిస్థితి అదుపు తప్పుతుందని హెచ్చరిస్తున్నారు. ఈ సమ్మె కేవలం వేతనాలు లేదా సౌకర్యాల కోసమే కాదు, అది ఆర్టీసీ మనుగడ కోసం సాగుతున్న పోరాటంగా కార్మికులు అభివర్ణిస్తున్నారు. సంస్థను రక్షించుకోవాలంటే ప్రభుత్వంలో విలీనం ఒక్కటే మార్గమని వారు బలంగా నమ్ముతున్నారు. శంకర్ గౌడ్ ఆత్మాహుతి యత్నం ఈ ఉద్యమానికి ఒక ఉద్వేగభరితమైన మలుపునిచ్చింది. ఇప్పుడు బంతి ప్రభుత్వ కోర్టులో ఉంది. పట్టువిడుపులతో సమస్యను పరిష్కరిస్తారా లేక బలప్రయోగంతో సమ్మెను అణచివేస్తారా అన్నది వేచి చూడాలి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న ఈ ఉత్కంఠతకు తెరపడాలంటే ఇరుపక్షాలు ఒక అడుగు వెనక్కి తగ్గి ప్రజా శ్రేయస్సు కోసం ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# తెలంగాణలో వైద్యం భారం

**మొదటిపేజీ తరువాయి**



అయితే మెరుగైన వైద్యం చేరువవుతున్న తరుణంలోనే సామాన్యుడి జేబుకు పెద్ద చిల్లు పడుతోందని తాజా గణాంకాలు హెచ్చరిస్తున్నాయి. ఆసుపత్రి గడప తొక్కితే రోగం తగ్గుతుందన్న నమ్మకం కంటే జీవితకాలం కష్టపడి కూడబెట్టిన సొమ్ము ఆవిరవుతుందన్న భయమే మధ్యతరగతి ప్రజలను ఎక్కువగా వేధిస్తోంది. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ విడుదల చేసిన హౌస్‌హోల్డ్ సోషల్ కన్సంప్షన్ హెల్త్ 2025 సర్వే ఈ చేదు వాస్తవాలను వెలుగులోకి తెచ్చింది. ఆసుపత్రిలో చేరితే అయ్యే సగటు ఖర్చు విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. జాతీయ సగటుతో పోలిస్తే తెలంగాణలో చికిత్స కోసం వెచ్చించాల్సిన మొత్తం ఊహించని స్థాయిలో పెరిగింది. ఈ నివేదిక ప్రకారం తెలంగాణలో సగటున ఒక రోగి ఆసుపత్రిలో చేరినప్పుడు 52,743 రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. దేశవ్యాప్త సగటు 37,858 రూపాయలతో పోలిస్తే ఇది దాదాపు 39 శాతం అదనం కావడం గమనార్హం. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడులో 48,288 రూపాయలు, ఆంధ్రప్రదేశ్‌లో 42,517 రూపాయలు సగటు ఖర్చుగా నమోదయ్యాయి. ఈ దక్షిణాది రాష్ట్రాలు కూడా జాతీయ సగటు కంటే ఎక్కువే ఖర్చు చేస్తున్నప్పటికీ తెలంగాణ దరిదాపుల్లో ఏ రాష్ట్రం లేకపోవడం ఇక్కడి పరిస్థితుల తీవ్రతను తెలియజేస్తోంది. వైద్యం కోసం ప్రజలు తమ ఆదాయంలో అత్యధిక భాగాన్ని వెచ్చించాల్సి వస్తోంది. రాష్ట్రంలో వైద్య ఖర్చులు ఇంతలా పెరగడానికి కార్పొరేట్ ఆసుపత్రుల విస్తరణే ప్రధాన కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. తెలంగాణలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందే రోగి సగటున 72,561 రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. పట్టణ ప్రాంతాల్లో ఈ భారం మరింత ఎక్కువగా ఉండి 79,783 రూపాయలకు చేరుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రైవేట్ ఆసుపత్రులు 66,757 రూపాయల వరకు వసూలు చేస్తున్నాయి. ఆశ్చర్యకరంగా నగరాల్లోని కొన్ని స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నడిచే ఆసుపత్రుల్లో చికిత్స ఖర్చు సగటున 1,03,920 రూపాయలుగా ఉండటం విస్మయానికి గురిచేస్తోంది. చారిటబుల్ పేరుతో నడిచే సంస్థల్లో సైతం ఇంత భారీ మొత్తంలో వసూళ్లు జరగడం గమనార్హం. కార్పొరేట్ ఆసుపత్రుల ఆధిపత్యం పెరగడం వల్లే ఈ అసాధారణ పెరుగుదల కనిపిస్తోందని సీనియర్ ఆరోగ్య నిపుణులు డాక్టర్ బుర్రి రంగారెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడులతో నడిచే ఆసుపత్రుల గొలుసుకట్టు సంస్థలు లాభార్జనే ధ్యేయంగా దూకుడుగా విస్తరిస్తున్నాయి. సాధారణ ద్రవ్యోల్బణం కంటే వైద్యరంగంలో ధరల పెరుగుదల రెట్టింపు వేగంతో సాగుతోంది. దీనివల్ల సామాన్య ప్రజలు నాణ్యమైన వైద్యం కోసం అప్పుల పాలు కావాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఆసుపత్రులు వెంచర్ క్యాపిటల్ నమూనాలోకి మారడం వల్ల రోగులను కేవలం వినియోగదారులుగానే చూసే ధోరణి పెరుగుతోంది. సేవా దృక్పథం కంటే వ్యాపార ప్రయోజనాలకే పెద్దపీట వేస్తుండటంతో చికిత్స వ్యయం భారంగా మారుతోంది. ప్రముఖ ఆరోగ్య నిపుణులు డాక్టర్ కిరణ్ మాదాల తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణలో జరుగుతున్న అప్పుల్లో గణనీయమైన భాగం కేవలం ఆసుపత్రి ఖర్చుల కోసమేనని తెలుస్తోంది. తాజా సర్వే ప్రకారం రాష్ట్రంలోని 10 శాతం గృహాలు వైద్య ఖర్చుల కోసమే రుణాలు తీసుకుంటున్నాయి. చికిత్స కోసం తీసుకుంటున్న ఈ అప్పులు అనేక కుటుంబాలను తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయి. ప్రాణం కాపాడుకోవడం కోసం ఉన్న ఆస్తులను అమ్ముకోవడం లేదా వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పులు చేయడం నిత్యకృత్యంగా మారింది. ఆరోగ్య రక్షణ అనేది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అయినప్పటికీ క్షేత్రస్థాయిలో అది సామాన్యుడికి అందుబాటులో లేని విలాసంగా మారుతోంది. ప్రైవేట్ ఆసుపత్రుల ఫీజులు ఆకాశాన్ని తాకుతున్న సమయంలో తెలంగాణలోని ప్రభుత్వ దవాఖానాలు పేదలకు కొండంత అండగా నిలుస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి పేద రాష్ట్రాల ప్రభుత్వ ఆసుపత్రులతో పోలిస్తే తెలంగాణలోని సర్కార్ ఆసుపత్రుల్లో రోగుల జేబుల నుంచి అయ్యే ఖర్చు చాలా తక్కువగా ఉండటం ఊరటనిచ్చే అంశం. తెలంగాణ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సగటు ఖర్చు కేవలం 5,856 రూపాయలు మాత్రమే కావడం విశేషం. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ వైద్యశాలల్లో ఈ సగటు అత్యల్పంగా 2,384 రూపాయలుగా నమోదైంది. ఇతర రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 10 వేల రూపాయలకు పైగా ఖర్చు అవుతుండగా ఇక్కడ మాత్రం పేదలకు తక్కువ వ్యయంతోనే చికిత్స అందుతోంది. తెలంగాణ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్ ఆఫ్ పాకెట్ ఎక్స్‌పెండిచర్ కేవలం 3,711 రూపాయలుగా నమోదు కావడం విశేషం. ప్రభుత్వ వైద్యం ఇంత చౌకగా అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రుల వైపు వెళ్లడానికి గల కారణాలను డాక్టర్ రంగారెడ్డి విశ్లేషించారు. ప్రభుత్వ రంగంలో ప్రాథమిక వైద్యం మెరుగ్గా ఉన్నప్పటికీ అత్యాధునిక టెర్షియరీ కేర్ సదుపాయాలు సరిపడా లేకపోవడం పెద్ద లోపంగా మారింది. క్లిష్టమైన శస్త్రచికిత్సలు, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్స కోసం రోగులు విధిలేక ఖరీదైన ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. రాష్ట్రంలో ఆరోగ్య బీమా కవరేజ్ 44 శాతం నుంచి 47 శాతానికి పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. బీమా సదుపాయం పెరిగినప్పటికీ జేబుల నుంచి పెట్టే ఖర్చు తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోంది. చికిత్స సమయంలో బీమా పరిమితిని దాటిన ఖర్చులు లేదా బీమా పరిధిలోకి రాని చికిత్సల వల్ల రోగులపై భారం పడుతోంది. నగదు రహిత చికిత్సలు అందిస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అనేక అదనపు ఖర్చులు రోగులే భరించాల్సి వస్తోంది. ఈ వ్యత్యాసాలను తగ్గించి సామాన్యుడికి పూర్తిస్థాయిలో ఉచిత వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నిపుణులు కోరుతున్నారు. బీమా పథకాల అమలులో పారదర్శకత పెరిగినప్పుడే రోగులకు అసలైన ప్రయోజనం కలుగుతుంది. ఈ సమస్యకు పరిష్కారంగా తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వంటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను విస్తరిస్తోంది. హైదరాబాద్ నలుమూలలా ఇలాంటి ఆధునిక వైద్యశాలలను అందుబాటులోకి తీసుకురావడం వల్ల ప్రైవేట్ ఆసుపత్రులపై ఆధారపడటం తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. సర్కార్ ఆసుపత్రుల్లోనే కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పిస్తే సామాన్యుడికి ఆర్థిక భారం తప్పుతుంది. అయితే కేవలం భవనాల నిర్మాణంతో సరిపెట్టకుండా తగినంత మంది నిపుణులైన వైద్యులను, సిబ్బందిని నియమించడంపై కూడా దృష్టి సారించాలి. అత్యాధునిక యంత్ర పరికరాలు నిరంతరం పనిచేసేలా చూడటం ద్వారానే ప్రజల నమ్మకాన్ని గెలవగలం. తెలంగాణ సీనియర్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ డి.శ్రీనాథ్ సూచన ప్రకారం ప్రభుత్వం ఆరోగ్య బడ్జెట్‌ను గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం బడ్జెట్‌లో కేటాయిస్తున్న 4.2 శాతాన్ని కనీసం 8 శాతానికి పెంచినప్పుడే మౌలిక సదుపాయాల కల్పన సాధ్యమవుతుంది. జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఆసుపత్రులను, పడకల సంఖ్యను పెంచాలి. ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగించి ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు వైద్య వ్యవస్థను ప్రక్షాళన చేయాలి. అప్పుడే ప్రైవేట్ సంస్థల దోపిడీకి అడ్డుకట్ట పడుతుందని వైద్య విద్యార్థులు, నిపుణులు బలంగా అభిప్రాయపడుతున్నారు. వైద్యం అనేది లాభార్జనతో కూడిన వ్యాపారం కాకూడదని, అదొక సామాజిక బాధ్యత అని ప్రభుత్వాలు గుర్తించాలి. ప్రైవేట్ ఆసుపత్రుల ఫీజుల నియంత్రణకు పటిష్టమైన చట్టాలను తీసుకురావాలి. చికిత్సల ధరలను ప్రామాణీకరించి బోర్డులపై ప్రదర్శించేలా కఠిన నిబంధనలు అమలు చేయాలి. ప్రభుత్వం తన వంతుగా ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం కలిగించేలా నాణ్యమైన సేవలను అందించాలి. వైద్యం కోసం ప్రజలు తమ ఆస్తులను అమ్ముకునే పరిస్థితి పోవాలి. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రభుత్వం, ప్రైవేట్ రంగాలు సమన్వయంతో సాగాలి. అప్పుడే తెలంగాణ రాష్ట్రం గ్లోబల్ హెల్త్‌కేర్ హబ్‌గా నిలవడమే కాకుండా సామాన్యుడికి అందుబాటులో ఉండే ఆరోగ్య ప్రదాయినిగా మారుతుంది.

## భట్టు విజయలక్ష్మి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొంగులేటి



**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:** కొత్తగూడెం పట్టణ పాలక సంస్థ పరిధిలోని 34వ విభాగ కార్పొరేటర్ భట్టు విజయలక్ష్మి, భట్టు లక్ష్మణ్ నాయక్ ల కుమారుడు అఖిల్ నందన్ ఇటీవల జరిగిన రహదారి ప్రమాదంలో మరణించడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ నేపథ్యంలో గురువారం రాష్ట్ర ఆదాయ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కరకవాగులోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్న మంత్రి, మృతుడు అఖిల్ నందన్ చిత్రపటానికి పూలమాల అర్పించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం మాజీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు,డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, పలువురు కార్పొరేటర్లు, మాజీ మండల పరిషత్ భూసంఘ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, బరిపటి వాసుదేవరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోండం వెంకన్న గౌడ్, కాంగ్రెస్ నాయకులు మహీపతి రామలింగం, పి నరహరి, వై వెంకటేశ్వర్లు, చింతా నాగరాజు, ఉండేటి శాంతి వర్ధన్, ధర్మసోత్ ఉపేందర్, అశోక్, ఉండేటి ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన యువకుడు



**పాల్వంచ విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం బొల్లెరుగూడెంలో ప్రేమ వ్యవహారం ఘర్షణాత్మక మలుపు తిరిగి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ప్రియుడు ఇంటి ముందే టెంట్ వేసి కుటుంబ సభ్యులతో కలిసి ప్రియురాలు దీక్ష చేపట్టడం స్థానికంగా సంచలనం రేపుతోంది. ఆరు సంవత్సరాలుగా ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి శారీరకంగా, ఆర్థికంగా వాడుకున్నాడని ప్రియురాలు శన్విత ఆరోపణలు చేసింది. పెళ్లి పేరుతో నమ్మించి చివరికి చేతులు దులిపేసుకున్నాడని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేది లేదని, తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా ప్రియుడు రావురి శ్రీరామ్ నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసినట్లు సమాచారం రావడంతో ఘటన మరింత వేడెక్కింది. అయితే ఈ ఆరోపణలను పూర్తిగా ఖండించిన ప్రియురాలి కుటుంబం.. అవి నిద్ర మాత్రలు కావని, కేవలం పారాసెటమాల్ మాత్రలు తీసుకుని డ్రామా చేస్తున్నాడని మండిపడింది. ఇరు వర్గాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు హద్దులు దాటడంతో కాలనీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం పోలీస్ స్టేషన్ వరకు రావడంతో ఇరు వర్గాల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రేమ వ్యవహారం ఇంతటి వివాదంగా మారడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. పెద్దల సమక్షంలో ఒప్పంద పత్రాలను రాసుకుని కూడా ప్రియుడు ముఖం చాటేస్తున్నాడని, ప్రియురాలి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## నేషనల్ టాలెంట్ టెస్ట్‌లో రెండవ ర్యాంక్

**సాధించిన పాల్వంచ విద్యార్థిని సాయి భవిష్య శ్రీ**




**పాల్వంచ విశాలభారతి :** ఒలింపియాడ్ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పోటీ పరీక్షల్లో పాల్వంచ నెహ్రూనగర్‌కు చెందిన అంబడిపూడి నరేందర్-శ్రీలత దంపతుల కుమార్తె, నారాయణ పాఠశాలలు లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని సాయి భవిష్య శ్రీ జాతీయ స్థాయిలో రెండవ ర్యాంకు సాధించినట్లు పాల్వంచ నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ పూరేటి నరసింహరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాదులోని రవీంద్ర భారతిలో బుధవారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో నారాయణ పాఠశాలల జీఎం గోపాల్ రెడ్డి, ఈటెక్నో ఆర్ & డి హెడ్ అనిల్ కుమార్, ఈ చాంప్స్ ఆర్ & డి హెడ్ స్వాతి లక్ష్మి , ఏజీఎం రాంకీ చేతుల మీదుగా విద్యార్థిని సాయి భవిష్య శ్రీకి కంప్యూటర్ ట్యాబు, మెడల్, షీల్డ్ మరియు సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, మారుమూల ప్రాంతమైన పాల్వంచ నుంచి జాతీయ స్థాయి ర్యాంకు సాధించడం గర్వకారణమని అన్నారు. విద్యార్థిని విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందిస్తూ, క్రమశిక్షణతో కూడిన విద్యార్థుల భవిష్యత్తు ఎంతో ఉన్నతంగా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ముందంజ వేయడానికి, విలువలతో కూడిన విద్యను అందించడానికి నారాయణ యాజమాన్యం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పూరేటి నరసింహరావు, ఈటెక్నో కోఆర్డినేటర్ ప్రవీణ్, ఈచాంప్స్ కోఆర్డినేటర్ వినోద లక్ష్మి, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజ్ డార్మిటరి ప్రారంభం

**శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే పాయం**



**మణుగూరు, విశాలభారతి:** మండలంలోని లంకమల్లారంలో ఉన్న తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ పరిధిలోని అప్గ్రేడ్ చేసిన ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ (గర్ల్స్)లో రూ. 2.70 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన డార్మిటరి బ్లాక్‌ను గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కలిసి ఘనంగా ప్రారంభించారు. అలాగే, కళాశాల పరిసర ప్రాంతంలో రూ. 1 కోటి అంచనా వ్యయంతో నిర్మించబడనున్న బీటీ రోడ్ పనులకు శంకుస్థాపన చేసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గిరిజన బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మెరుగైన వసతి సదుపాయాలు కల్పించడం ద్వారా విద్యార్థినులు మరింత ఉత్తమ ఫలితాలు సాధిస్తారని పేర్కొన్నారు. మణుగూరు ప్రాంతంలో విద్యా మరియు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, విద్యాశాఖ ప్రతినిధులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డి సి సి అధ్యక్షులు తోట దేవి ప్రసన్న, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళా నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కంటి శుక్ల పరీక్షలతో ప్రజలకు చేరువైన ఉచిత వైద్య శిబిరం

**సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ గారు మరియు సర్పంచ్ పోలేబోయిన సుజాత**

**విశాలభారతి, కరకగూడెం:** గ్రామ పంచాయతీ కార్యాలయంలో సూర్య స్వచ్ఛంద సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి ఉచిత కంటి శుక్ల పరీక్ష శిబిరంలో పాల్గొని రోగులను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ కరకగూడెం మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ మరియు సర్పంచ్ పోలేబోయిన సుజాత. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని, ముఖ్యంగా కంటి శుక్ల (క్యాటరాక్ట్) వంటి సమస్యలను ముందుగానే గుర్తించడం ద్వారా దృష్టి సమస్యలను నివారించవచ్చని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడం ఒక మంచి సేవ కార్యక్రమమని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వివిధ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## భగీరథ మహర్షి జయంతి ఘనంగా నిర్వహణ




**మహబూబాబాద్, విశాలభారతి:** తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అనుమతితో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం భగీరథ మహర్షి జయంతి వేడుకలను మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగీరథ మహర్షి మహాజ్ఞాని, అపారమైన దీక్ష, సహనం కలిగిన మహనీయుడు అని కొనియాడారు. ఎలాంటి కష్టాలు ఎదురైనా వాటిని అధిగమిస్తూ లక్ష్యాన్ని సాధించడంలో ఆయన చూపిన పట్టుదల నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి. శ్రీనివాసరావు, వసతి గృహ సంక్షేమ అధికారులు, ఇతర జిల్లా అధికారులు, ఐడిఓసి కార్యాలయ సిబ్బంది, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

**సీతారాముల కళ్యాణ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహణ**



**డోర్నకల్, విశాలభారతి:** డోర్నకల్ నియోజకవర్గం, నరసింహులపేట మండలంలోని కౌసల్యదేవిపల్లి గ్రామంలో నూతనంగా శ్రీ సీతారామచంద్ర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమాలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవాలు భక్తుల నడుమ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రివర్యులు శ్రీమతి సత్యవతి రాథోడ్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ఇటువంటి పుణ్యకార్యాలు గ్రామానికి శాంతి, ఐశ్వర్యం, సమృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో సేవలందించారు. ఈ వేడుకలలో స్థానిక గ్రామ సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, నరసింహులపేట మాజీ సర్పంచ్ బండ బిక్షం రెడ్డి, గొట్టిముక్కల నరసింహారెడ్డి, ఉపసర్పంచ్ బానోతు రవి నాయక్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు గండి వీరేందర్ గౌడ్, కురవి మండల బిఆర్ఎస్ నాయకులు బోడ శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు. మొత్తంగా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం గ్రామంలో ఉత్సవ వాతావరణాన్ని నెలకొల్పింది.

## మైనర్ బాలిక మృతికి కారణమైన వ్యక్తి అరెస్ట్

**కురవి ఎస్సై గండ్రాతి సతీష్**



**కురవి విశాలభారతి:** కురవి మండలం లో మైనర్ బాలిక మృతికి కారణమైన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసినట్లు కురవి ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపారు. కురవి ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 14042026న ఒక మైనర్ బాలిక గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడి అనంతరం చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, ఆమె 18042026న చికిత్స పొందుతూ మృతి చెందింది. మరణానికి ముందు ఇచ్చిన వాంగ్మూలంలో బానోత్ కిరణ్ అనే వ్యక్తి కారణమని బాలిక పేర్కొనడంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. దర్యాప్తులో నిందితుడు బాలికకు బంధువే అయినప్పటికీ, మారుపేర్లతో ఇన్‌స్టాగ్రామ్ ఐడి ద్వారా పరిచయం పెంచుకుని తను మల్లా రెడ్డి కాలేజీ విద్యార్థి అని నమ్మించి ప్రేమ పేరుతో ఆమెను వంచించినట్లు తేలింది కానీ ఇప్పటికే వివాహం జరిగి ఇద్దరు పిల్లలు ఉన్న విషయం దాచిపెట్టినట్లు మరియు నిందితుడు వరుసకు అన్న అవుతాడు అని తెలుసుకున్న తరువాత బాలిక నిందితుడు ని దూరం పెట్టేందుకు ప్రయత్నించగా, నిందితుడు తన దగ్గర ఉన్న కాల్ రికార్డింగ్స్ బయటపెడతానని, పరువు తీస్తానని బెదిరించిగా ఒత్తిడిని తట్టుకోలేక బాలిక గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడి మృతి చెందినట్లు పేర్కొన్నారు. అదే విధంగా, నిందితుడు గతంలో కూడా తాను లాయర్ అని చెప్పి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకి సంబంధించి పోక్సో కేసు లో శిక్ష పడ్డ నిందుతుడు కి హైకోర్టు లో బెయిల్ ఇప్పిస్తా అని నిందితుడి తండ్రి నుండి సుమారు 12 లక్షలు రూపాయలు కూడా తీసుకున్నట్లు మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కి సంబంధించి బంగారు చాన్ దొంగతనం కేసులో నిందుతుడి ప్రమేయం ఉన్నట్లు తేలినది. ప్రస్తుతం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు, కేసుపై మరింత దర్యాప్తు కొనసాగుతున్నట్లు కురవి ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపారు.

## దమ్మపేట ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డికి సత్కారం



- **రోడ్డు భద్రత, డ్రంక్ అండ్ డ్రైవ్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు**
- **"అరైవ్–అలైవ్" కార్యక్రమానికి ప్రశంస పత్రం అందుకున్న ఎస్ఐ**
- **సమాజ శ్రేయస్సు కోసం కలిసి పనిచేయాలని పిలుపు**

**అశ్వారావుపేట విశాలభారతి :**

బహుజన దమ్మపేట మండల పాస్టర్స్ కమిటీ ఆధ్వర్యంలో దమ్మపేట సబ్ ఇన్స్పెక్టర్ సాయి కిషోర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. మండల పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలను నివారించేందుకు చేపడుతున్న చర్యలను ఈ సందర్భంగా ప్రశంసించారు.యువత మత్తు పదార్థాలు సేవించి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని "అరైవ్-అలైవ్" వంటి అవగాహన కార్యక్రమాలను ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించినందుకు ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈ సత్కారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, పాస్టర్లు తమ సంఘాలలోని సభ్యులకు మరియు గ్రామ ప్రజలకు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అనే విషయంపై అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు.దీనికి స్పందించిన పాస్టర్స్ కమిటీ సభ్యులు, సమాజ శ్రేయస్సు కోసం తమ వంతు సహకారం అందిస్తూ ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సెబాస్టియన్, ఉపాధ్యక్షుడు యేసురత్నం, కార్యదర్శి క్రాంతి కుమార్, సంయుక్త కార్యదర్శి జకర్యా, కమిటీ పెద్దలు నిరీక్షణరావు, దైవప్రసాద్, రవిబాబు, జాన్ బాబు, రమేష్ జాషువా, శ్యాంబాబు, తిమోతి, ప్రసాద్, ఇశ్రాయేలు, జోషెఫ్, లారెన్స్, అర్జున్ తదితర పాస్టర్లు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు ఎండల పట్ల అవగాహన

- **ఎలకలగూడెంలో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ**
- **పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం**
- **వేసవి సెలవులపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు సూచనలు**
- **పాల్గొన్న ఎంపీడీవో ముత్యాలరావు, సర్పంచ్ కలేటి నాగమణి**

**అశ్వాపురం , విశాలభారతి:**

ప్రస్తుతం భానుడు నిప్పులు చెరుగుతున్న నేపథ్యంలో, పనులకు వెళ్లే ఉపాధి హామీ కూలీలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో ముత్యాలరావు సూచించారు. గురువారం అశ్వాపురం మండలం ఎలకలగూడెం గ్రామపంచాయతీలో ఎంపీడీవో, సర్పంచ్ కలేటి నాగమణి ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

**కూలీలకు ఓఆర్ఎస్ పంపిణీ**

ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలు మధ్యాహ్న సమయాల్లో పనులకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వడదెబ్బ బారిన పడకుండా ఉండటానికి తగినంత నీరు తాగాలని, పని ప్రదేశాల్లో ఓఆర్ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచిస్తూ, కూలీలకు వాటిని పంపిణీ చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా లభించే ప్రయోజనాలను వివరించి, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



**పాఠశాల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి**

అనంతరం ఎలకలగూడెం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఎంపీడీవో ముత్యాలరావు, సర్పంచ్ కలేటి నాగమణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేసవి సెలవుల దృష్ట్యా విద్యార్థులు ఇంటి వద్ద ఎలా ఉండాలి, ఎండల బారి నుంచి పిల్లలను ఎలా కాపాడుకోవాలి, సెలవుల్లో చదువును కొనసాగించేలా తల్లిదండ్రులు ఎలాంటి చొరవ తీసుకోవాలి వంటి అంశాలపై వారు అవగాహన కల్పించారు. పిల్లల ఆరోగ్యం, భద్రత పట్ల తల్లిదండ్రులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరన్న, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చెరువులతో పాటు ఎస్టీపీల నిర్మాణం పూర్తి చేయాలి

**హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్**

**రాజేంద్రనగర్, విశాలభారతి :**



చెరువుల పునరుద్ధరణ పనులు చేపడుతున్నప్పుడు సమాంతరంగా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్టీపీలు) కూడా పూర్తి కావాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులకు ఆదేశించారు. అలా చేసినప్పుడే చెరువుల పునరుద్ధరణకు పూర్తి ప్రయోజనం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. రెండో విడతలో చేపట్టిన 14 చెరువుల అభివృద్ధి పనులలో భాగంగా గండిపేట్ మండలం ఇబ్రహీంబాగ్‌లోని ఇబ్రహీంబాగ్ చెరువును గురువారం కమిషనర్ పరిశీలించారు. చెరువులో పూడిక పూర్తిగా తొలగించాలని, అప్పుడు మాత్రమే దుర్గంధం తగ్గి భూగర్భ జలాలు పెరుగుతాయని సూచించారు. చెరువుల పునరుద్ధరణ పూర్తయ్యే సమయానికి ఎస్టీపీలు సిద్ధంగా లేకపోతే మళ్లీ మురుగు నీరు చేరి జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆయనy హెచ్చరించారు. ఎస్టీపీ పనులను పర్యవేక్షిస్తున్న జలమండలి అధికారులతో మాట్లాడి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం 56 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్టీపీలు నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎస్టీపీ నుంచి వచ్చే నీటిని ముందుగా సెడిమెంటేషన్ పాండ్‌లోకి తరలించి, అక్కడి నుంచి ప్రధాన చెరువులోకి పంపే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువుల పునరుద్ధరణలో రాజీపడొద్దు దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఇబ్రహీంబాగ్ చెరువులో ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఆక్రమణలను ఇప్పటికే తొలగించినట్లు తెలిపారు. వాటిని అభివృద్ధి పరిధిలోకి తీసుకుని చెరువును సమగ్రంగా అభివృద్ధి చేయాలని కమిషనర్ సూచించారు. ఇన్‌లెట్లు, ఔట్‌లెట్ల నిర్మాణంలో శాస్త్రీయ విధానాలను అనుసరించాలని, వరద నీరు మాత్రమే చెరువులోకి చేరేలా, మురుగు నీరు వేరుగా వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. చెరువు చుట్టూ పాత్‌వేలు ఏర్పాటు చేసి అన్ని వయసుల వారు సేద తీరేలా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఈ చెరువుకు సుమారు 29.53 చదరపు కిలోమీటర్ల పరిధి నుంచి వరద నీరు చేరుతుందని, చెరువు నిండిన తర్వాత ఆ నీరు మూసీ నదిలో కలుస్తుందని తెలిపారు. ఇంతకు ముందు కొండాపూర్‌లో అభివృద్ధి చేసిన కుడికుంట చెరువును కూడా కమిషనర్ సందర్శించారు. చెరువు పరిధిలోని భూములను పరిరక్షించాలని, పార్కుల అభివృద్ధి ద్వారా ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని సూచనలు చేశారు. ఈ సందర్భంగా జల సంరక్షణలో కృషి చేస్తున్న సంస్థల సేవలను ఆయన అభినందించారు.

## అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ముమ్మరం చేసిన సైబరాబాద్ పోలీసులు

**రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన, ఆపరేషన్ రోప్ అమలు**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రమేష్

**సైబరాబాద్‌విశాలభారతి:** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా సైబరాబాద్ పోలీసులు 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా కార్యక్రమాన్ని మరింత ముమ్మరం చేశారు. సత్వ నాలెడ్జ్ పార్క్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో డీజీపీ, వీ అండ్ ఈ, టీజీసీఎస్‌బీ అండ్ ఎఫ్ఎస్ఎల్ డీజీ శిఖా గోయల్ పాల్గొన్నారు.రోడ్డు భద్రత వ్యక్తిగత బాధ్యత అని, జరిమానాలను తప్పించుకోవడం కోసం కాదని ఆమె అన్నారు. గత ఏడాది రాష్ట్రంలో 8 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారని, సీట్ బెల్ట్, హెల్మెట్ వినియోగం పెరిగినా ప్రవర్తనలో మార్పు రావాల్సి ఉందని పేర్కొన్నారు. మొబైల్ వాడకం వల్ల కొన్ని సెకన్ల ఏమరుపాటు ప్రాణాలు తీస్తుందని హెచ్చరించారు.సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ అతివేగం, డ్రంక్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, మొబైల్ వాడకం ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు. "స్పీడ్ థ్రిల్స్, కానీ కిల్స్" అని గుర్తు చేశారు. 1835 ఏళ్ల వయసు వారే ప్రమాదాల్లో ఎక్కువగా మరణిస్తున్నారని, డిఫెన్సివ్ డ్రైవింగ్ అలవర్చుకోవాలని సూచించారు. పాదచారుల భద్రత, ట్రాఫిక్ ప్రవాహం కోసం 'ఆపరేషన్ రోప్' ద్వారా రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగిస్తున్నామని తెలిపారు. లేన్ క్రమశిక్షణ, హెడ్‌లైట్ల సరైన వినియోగం పాటించాలని, స్వల్ప దూరాలు నడవడం, కార్‌పూలింగ్ చేయాలని కోరారు. లైసెన్స్ పొందే ముందు స్వచ్ఛంద సంస్థల సాయంతో అవగాహన శిక్షణ ఇస్తామని సీపీ వెల్లడించారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

**సర్పంచ్ చేతుల మీదుగా రెండు కార్యక్రమాలు ఘనంగా నిర్వహణ**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** అబ్దుల్లాపూర్మెట్ మండలం చిన్న రావిర్యాల గ్రామపంచాయతీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నాగుల భావన ఋషి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు.అదేవిధంగా గ్రామంలో కల్లెం ప్రతాప్ రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం కేంద్రాన్ని కూడా సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ ప్రారంభించారు. వేసవి కాలంలో గ్రామ ప్రజలకు చల్లని తాగునీరు అందించేందుకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని గ్రామస్థులు తెలిపారు.గ్రామ అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు మరింత దోహదపడతాయని నాయకులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సద్దిపల్లి శిరీష శంకర్ రెడ్డి, వార్డు సభ్యులు ఆకిటి రామకృష్ణారెడ్డి, అభవతి బాలయ్య, నా రెడ్డి రిషిత సతీష్ రెడ్డి, రాపోలు మల్లేష్, బండారి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ జాలిగం కనకమ్మ, జాలిగం వెంకటేష్ పాల్గొన్నారు.అలాగే ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మహిళా సంఘం అధ్యక్షురాలు కొమురెల్లి రేణుక, కడవేరు శ్రీనివాసరావు, కల్లెం శ్రీధర్ రెడ్డి, కల్లెం ధర్మారెడ్డి, కల్లెం లింగారెడ్డి తదితరులు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేశారు.

## మహిళా ఆగ్రహ యాత్ర జయప్రదం

**మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్**



**సికింద్రాబాద్, విశాలభారతి:** మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న కుటిల రాజకీయాలను నిరసిస్తూ, నారీ శక్తి హక్కులను కాలరాస్తున్న వారి వైఖరిని ఎండగట్టేందుకు భారతీయ జనతా పార్టీ బౌద్ధ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ ఆధ్వర్యంలో పార్సిగుట్ట నుండి ట్యాంక్ బండ్ వరకు మహిళల ర్యాలీ తో వెళ్లి పాల్గొనడం జరిగిందని. మహిళా ఆగ్రహ యాత్ర చేపట్టడం మహిళా సాధికారతకు అడ్డుపడుతున్న కాంగ్రెస్ అనుబంధ పార్టీలు మహిళల హక్కులను కాలు రాస్తున్న వారికి బుద్ధి చెప్పేందుకు, ఈ యాత్రలో ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయడం జరిగిందని స్వరూప గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో సరిత,రమ,సుశీల, ప్రభ, కవిత,రాజమణి, భారతి,భాగ్యలక్ష్మి, శ్రీలత,ఎల్లమ్మ, బిజెపి డివిజన్ అధ్యక్షులు సాయి ప్రసాద్ గౌడ్, నాగరాజు,లడ్డు, జయంత్, అగుల్ల శీను తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ నగర్ యూపీహెచ్‌సీలో వైద్య సేవలు

**ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం**



**కూకట్ పల్లి విశాలభారతి:** హనుమాన్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్న యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆరోగ్య సేవలు మరియు ప్రజా ఆరోగ్య అవగాహన కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ ప్రేమ అమృత పర్యవేక్షణలో నిర్వహించగా, ఏఎన్ఎమ్ మంజుల సేవలు అందించారు. ఆశా కార్యకర్తలు కరుణ, భాగ్యలక్ష్మి, శబిత, రాజేశ్వరి, లక్ష్మీ బాయి, మౌనిక పాల్గొని స్థానిక ప్రజలకు ఆరోగ్య సూచనలు, వైద్య సేవల వివరాలు తెలియజేశారు. ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా వైద్య సిబ్బంది ఇంటింటికి చేరుకుని సేవలు అందిస్తున్నారని స్థానికులు అభినందించారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో బాటసింగారం విద్యార్థులకు బంగారు పతకం

**పైల్వాన్ క్లబ్ ఇంటర్ స్కూల్ ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రదర్శన – 24 జట్లపై ఆధిపత్యం**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటారు.మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లాలోని కూకట్‌పల్లిలో ఈ నెల 22న నిర్వహించిన పైల్వాన్ క్లబ్ రాష్ట్రస్థాయి ఇంటర్ స్కూల్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు.ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి. ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొన్న బాటసింగారం విద్యార్థులు దాదాపు 24 జట్లపై ఆధిపత్యం చాటుతూ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఫైనల్ మ్యాచ్‌లో 2410 పాయింట్ల తేడాతో విజయం సాధించి ఛాంపియన్‌షిప్‌ను తమ సొంతం చేసుకున్నారు. విద్యార్థుల ఈ విశిష్ట విజయంపై పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ ప్రజలు, జిల్లా క్రీడాభిమానులు విద్యార్థులను అభినందిస్తూ వారి ప్రతిభను కొనియాడారు. ఈ విజయంతో బాటసింగారం పాఠశాల పేరు రాష్ట్రస్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా నిలిచిందని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రామోజీ ఫౌండేషన్ నుంచి కంప్యూటర్ల బహుకరణ



**ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా పంపిణీ**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అబ్దుల్లాపూర్ మెట్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రామోజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులకు కంప్యూటర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత డిజిటల్ యుగంలో సాంకేతిక విద్య అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉందని తెలిపారు.విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భవిష్యత్తులో పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలని సూచించారు. కంప్యూటర్ విద్య ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించి, ఉపాధి అవకాశాలను విస్తరించుకోవచ్చని పేర్కొన్నారు. రామోజీ ఫౌండేషన్ సామాజిక సేవలో భాగంగా విద్య, వైద్య, మౌలిక వసతుల రంగాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తోంది. ఇప్పటికే అబ్దుల్లాపూర్ మెట్ ప్రాంతంలో ప్రభుత్వ భవనాల నిర్మాణం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలకు కూడా ఈ సంస్థ సహకారం అందించినట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా అందించిన కంప్యూటర్లు విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించడంలో తోడ్పడటంతో పాటు, సాంకేతిక విద్యలో కొత్త అవకాశాలకు మార్గం సుగమం చేస్తాయని కళాశాల అధ్యాపకులు తెలిపారు.ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు వంటి విద్యాసంస్థలు సాంకేతిక విద్యలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల అభివృద్ధి, నాణ్యమైన విద్య అందించేందుకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల యంపి డి ఓ శ్రీవాణి, ఎమ్మార్వో సుదర్శన్ రెడ్డి, సీఐ అశోక్ రెడ్డి, అబ్దుల్లాపూర్ మెట్ గ్రామ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చామ సంపూర్ణ విజయశేఖర్ రెడ్డి, మాజీ యం పి పి బుర్ర రేఖా మహేందర్ గౌడ్, మాజీ డైరెక్టర్ ముత్యాల రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మజీద్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు బహుమతుల ప్రదానం

- **ఉచిత ఇంటర్నెట్ సదుపాయంతో నాణ్యమైన బోధన**
- **దాత మేడిపల్లి పాండుకు ఘన సన్మానం**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**



అబ్దుల్లాపూర్ మెట్ మండలం మజీద్‌పూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా సంవత్సరపు చివరి రోజున విద్యార్థులకు బహుమతుల ప్రదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 6వ, 7వ, 8వ, 9వ తరగతులకు చెందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. అదేవిధంగా పాఠశాలకు రెగ్యులర్‌గా హాజరైన విద్యార్థులను కూడా ప్రోత్సహిస్తూ ప్రత్యేకంగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల ఇంటర్నెట్ దాత మేడిపల్లి పాండు చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గత రెండు సంవత్సరాలుగా పాఠశాలకు ఉచితంగా అన్లిమిటెడ్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తూ వస్తున్న ఆయన సేవలను ఉపాధ్యాయులు ప్రత్యేకంగా ప్రశంసించారు.ఇంటర్నెట్ సదుపాయం ద్వారా ప్రతి తరగతి గదిలో డిజిటల్ విధానంలో పాఠ్యాంశాలను బోధించడం వల్ల విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా నాణ్యమైన బోధన అందుతున్నదని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ విధానం విద్యార్థుల అభ్యాస స్థాయిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నదని వారు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా మేడిపల్లి పాండు మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరంలో కూడా పాఠశాలకు ఉచితంగా ఇంటర్నెట్ సౌకర్యం కొనసాగిస్తానని తెలిపారు. ఆయన సేవలను కొనియాడుతూ పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కోదండ రామచంద్ర స్వామి ఆలయ మహోత్సవాలు



**రాజేంద్రనగర్, విశాలభారతి :**

పుప్పాలగూడలోని సంకట హరణ శ్రీ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలో నిర్మించిన శ్రీ సీతా లక్ష్మణ హనుమత్సమేత శ్రీ కోదండ రామచంద్ర స్వామి నూతన ఆలయ మహోత్సవాలు భక్తుల నడుమ ఘనంగా కొనసాగుతున్నాయి. మై హోం అవతార్ రోడ్, హాల్‌మార్క్ విసినియా ఎదురుగా ఉన్న ఈ ఆలయంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మూడవ రోజు గురువారం ఉదయం ప్రాభోధకే, చతుస్థానార్చన, బింబోత్థాపన, రత్న విన్యాస హవనాలు, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అష్టధాతు, లోహ, ధాన్య, రత్న విన్యాస యంత్ర ప్రతిష్ఠాపనతో పాటు ధ్రువమూర్తి ప్రతిష్ఠ, ఉత్సవమూర్తులు, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలు నిర్వహించారు. తదుపరి మహాకుంభప్రోక్షణం, దిష్టికుంభ దర్శనం, ప్రథమారాధన, నివేదన, శాస్త్రకళ్యాణం, ఋత్విక్ సమ్మానాలు, మహదాశీర్వచనం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. భక్తులకు భారీ స్థాయిలో అన్నదానం ఏర్పాటు చేశారు శుక్రవారం (24042026) ఉదయం 10 గంటలకు శ్రీ కోదండ రామస్వామి వారి పట్టాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఏప్రిల్ 21 నుంచి 24 వరకు ప్రతిరోజూ అన్నప్రసాద వితరణ కొనసాగుతుండగా, 23న అఖండ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ మహోత్సవాలకు పలువురు ప్రముఖులు హాజరై స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు, హైడ్రా కమిషనర్ రంగనాథ్, తోకల శ్రీనివాస్ రెడ్డి, కస్తూరి నరేంద్ర, నరేంద్ర రెడ్డి, జితేంద్ర, తలారి మల్లేష్, కోట వేణుగౌడ్, అశోక్ యాదవ్, స్వామి గౌడ్, కృష్ణమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. భక్తులు భారీగా తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేశారు.

## శంషాబాద్‌లో గాలివాన బీభత్సం



**రాజేంద్రనగర్, విశాలభారతి :** శంషాబాద్ మండలం చౌదర్‌గూడ ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం తీవ్ర విధ్వంసం సృష్టించింది. ముఖ్యంగా చౌదర్‌గూడ గ్రామంలోని ఇంద్రారెడ్డి కాలనీలో గాలివాన బలానికి ఇళ్ల పైకప్పులు ఎగిరిపడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోగుల నీరజ-మల్లేష్ దంపతుల నివాసంలో రేకులతో నిర్మించిన పైకప్పు గాలివానకు ఎగిరిపోవడంతో ఇంటిలోని సామాగ్రి పూర్తిగా దెబ్బతింది. ఇంట్లో ఉన్న ఫ్యాన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు వర్షపు నీటిలో తడిసి పనికిరాకుండా పోయాయి. సీలింగ్ ఫ్యాన్లు కూడా గాలికి ఎగిరిపోవడం గమనార్హం. ఈ ఘటనలో అదృష్టవశాత్తూ ఎవరికి గాయాలు కాకపోయినప్పటికీ, భారీ స్థాయిలో ఆస్తి నష్టం వాటిల్లింది. ఇటీవల నిర్మించిన కొత్త ఇళ్లకు కూడా పైకప్పులు ఎగిరిపోవడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షం తమ జీవితాలను రోడ్డున పడేసిందని, తీసుకున్న గృహ రుణాలు ఎలా తీర్చాలో తెలియక ఆవేదన చెందుతున్నారు. ఇంట్లో ఉన్న తినుబండారాలు కూడా పూర్తిగా తడిసి నాశనమవడంతో రాత్రికి తినడానికి ఆహారం లేక ఇబ్బందులు పడుతున్నామని బాధిత మహిళలు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, అధికారులు మరియు ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

**బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నగేష్ ముదిరాజ్**



**ముషీరాబాద్,విశాల భారతి:** కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావుపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఇచ్చిన తీర్పును బిఆర్ఎస్ పార్టీ స్వాగతించిందని ఆ పార్టీ సీనియర్ నాయకులు నగేష్ ముదిరాజ్ తెలిపారు.ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి అటెన్షన్ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ కాదు ప్రదేశ్ కాంగ్రెస్ రిపోర్టని స్పష్టం చేశారు. కాళేశ్వరం కూలింది అని చిల్లర రాజకీయాలు చేయడం మానుకొని రాష్ట్ర అభివృద్ధి పై దృష్టి పెట్టాలని సూచించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**సేవాలాల్ సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు భూక్య సంజీవ నాయక్ డిమాండ్**



**ముషీరాబాద్,విశాలభారతి:** కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సేవాలాల్ సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు భూక్య సంజీవ నాయక్ డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే అన్ని జిల్లాలు, నియోజక వర్గాలలో పర్యటించి ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. లంబాడీలకు చట్ట సభల్లో ప్రాధాన్యత పెరగాలని ఆ దిశగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్ సేన తెలంగాణ అధ్యక్షులు బానోతు హుస్సేన్నాయక్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంజీవ నాయక్ మాట్లాడుతూ... దళితులు క్రిస్టియన్ మతాన్ని తీసుకుంటే ఎస్సీ నుండి తీసివేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని ఈ విషయం పై మందకృష్ణ మాదిగ, బ్రాహ్మణ సమాజం మధ్య చర్చోప చర్చలు జరిగాయని అన్నారు. అయితే ప్రకృతి మా దేవత అని మా గురువులు, మా దేవుళ్లు అని అలాంటిది మా గుళ్లను కూడా కబ్జాలోకి తీసుకొని గుడుల పేర్లను కూడా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండోమెంట్ పేరుతో మా గుళ్లను స్వాధీనం చేసుకొని పేర్లను ఎందుకు మారుస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సేవా లాల్ సేన ప్రతినిధులు సైదా నాయక్, కళ్యాణ్ నాయక్, ప్రవీణ్, అరుణ్, విశాల్, సందీప్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పెహల్గాం అమరవీరులకు శ్రద్ధాంజలి ర్యాలీ




**సికింద్రాబాద్, విశాలభారతి:** మురళీకృష్ణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారసిగూడ చౌరస్తా నుండి సీతాఫల్మండి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.అమరవీరులకు నివాళులర్పించుకుంటూ నినాదాలు ఇస్తూ యువ నాయకుడు మురళీకృష్ణ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఆనాడు జరిగిన సంఘటనలు పాకిస్తాన్ ఉగ్రవాదులను వారి అరాచకత్వాన్ని తీవ్రవాదాన్ని తీవ్రంగా ఖండించడం జరిగింది. అమరజవాళ్లకు ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి సికింద్రాబాద్ జిల్లా మహంకాళి ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, రాచమల్ల కృష్ణమూర్తి, ప్రభు గుప్తా, భాస్కర్ గిరి, రాజేశ్వరరావు, మేకల కీర్తి హర్ష కిరణ్, కుమారస్వామి, ముఠా గణేష్, సతీష్, వనమాల శ్రీనివాస్ యూత్ అసోసియేషన్ సభ్యులు. పాల్గొన్నారు.

## వివాహ వేడుకలకు హాజరైన బీజేపీ నేత వడ్డేపల్లి రాజేశ్వరరావు, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

**కేజీఆర్, నైనా కన్వెన్షన్ హాళ్లలో నూతన వధూవరులకు ఆశీస్సులు**



**నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న వడ్డేపల్లి,అరికెపూడి**

**కూకట్‌పల్లి, విశాలభారతి:** బాచుపల్లిలోని కేజీఆర్ కన్వెన్షన్ హాల్ మరియు కూకట్‌పల్లి నైనా కన్వెన్షన్ హాల్‌లో జరిగిన పలు వివాహ వేడుకలకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావుతో పాటు,పిఏసి చైర్మన్,శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ హాజరయ్యారు. ఆహ్వానం మేరకు విచ్చేసిన వారు నూతన వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించారు.ఈ సందర్భంగా వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఆనందమయమైన దాంపత్య జీవితాన్ని గడపాలని వడ్డేపల్లి రాజేశ్వరరావు,ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రెండవ రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సీపీఐ మద్దతు




**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కొనసాగుతున్న సమ్మెకు సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అబ్దుల్లాపూర్ మెట్ మండల సీపీఐ కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బండ్లగూడ బస్ డిపో వద్ద సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాంతియుతంగా నిర్వహిస్తున్న రెండవ రోజు సమ్మెను పోలీసులు అడ్డుకోవడంతో కార్మికులు, పోలీసుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరువర్గాల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది.ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని పూర్తిగా ప్రభుత్వంలో విలీనం చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.కార్మికుల హక్కుల కోసం ఈ పోరాటం కొనసాగుతుందని, ప్రభుత్వం స్పందించకపోతే మరింత ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో AITUC రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు కేతారాజు నర్సింహా, BOC జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్, సీపీఐ నాయకులు పేరాల గోపి, శోభన్, అశోక్, ఉప్పలయ్య, మల్సూర్ తదితరులు పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు.

## హిందూ సమ్మేళనానికి దండెం రాంరెడ్డిని ఆహ్వానించిన నిర్వాహకులు

**ఏప్రిల్ 25న పెద్ద అంబర్‌పేట్ జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో కార్యక్రమం**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** పెద్ద అంబర్‌పేట్ డివిజన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏప్రిల్ 25న నిర్వహించనున్న హిందూ సమ్మేళన కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దండెం రాంరెడ్డిని నిర్వాహకులు ఆహ్వానించారు.ఈ సందర్భంగా హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమం విజయవంతం కావాలని కోరుతూ ఆయన హాజరు కావాలని అభ్యర్థించారు. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ముత్తడి శేఖర్ రెడ్డి, అధ్యక్షులు పిల్లి నాగేష్ యాదవ్, ఉపాధ్యక్షులు పండుగుల రాము, ప్రధాన కార్యదర్శి జనగాం నర్సింహ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ షిరిడి సాయిబాబ సంస్థాన్ 27వ వార్షికోత్సవం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఎల్ బి నగర్ నియోజకవర్గం వనస్థలిపురం ప్రశాంత్ నగర్‌లోని శ్రీ షిరిడి సాయిబాబ సంస్థాన్ 27వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఉదయం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, లాస్య రెడ్డి దంపతులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ రూపొందించిన ఆన్‌లైన్ సేవలను చిలుక మధుసూదన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. భక్తులకు సులభంగా సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ డిజిటల్ సేవలను ప్రవేశ పెట్టినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయిబాబ ఆశీస్సులు పొందారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అలంకరణలు, భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## ఘనంగా నందిని–వినోద్ కుమార్ వివాహం

**మునిపల్లి, విశాల భారతి :** సంగారెడ్డి జిల్లా ముగ్ధంపల్లి గ్రామానికి చెందిన రామ్ సతీష్ సోదరుడు నాగరాజు కుమార్తె నందిని వివాహం వినోద్ కుమార్ తో ఘనంగా జరిగింది. సంగారెడ్డి జిల్లా బొడ్మెట్ పల్లిలోని శ్రీ రామ్ కళ్యాణ మండపంలో జరిగిన ఈ వేడుకకు బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శాస్త్రోక్తంగా జరిగిన ఈ వివాహ వేడుకలో నూతన వధూవరులు నందినివినోద్ కుమార్లను పలువురు ప్రముఖులు మరియు స్నేహితులు ఆశీర్వదించారు.రామ్ సతీష్ స్నేహితులు సూర్యాపేట సురేష్, షాపురం వెంకటేశం, రఘుపతి రెడ్డి, సుధాకర్, మహేష్ యాదవ్, మరియు శ్రీను ఈ వివాహానికి హాజరై, వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ అక్షింతలు వేసి ఆశీర్వదించారు. నూతన దంపతులు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు.



# వివేకానంద నగర్ డివిజన్‌లో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన పర్యటన



**వాకర్స్ తో కలిసి పార్కులో పర్యటించిన సిఎంసి కమిషనర్ సృజన, డీసీ చాముండేశ్వరి**



**స్థానికులను అడిగి సమస్యలను తెలుసుకుంటున్న సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన**

- **వినాయక్ పార్క్, సీనియర్ సిటిజన్ పార్కుల్లో గంటన్నర పాటు తనిఖీలు**
- **10 కీలక అంశాలపై వెంటనే కార్యాచరణ రూపొందించాలని ఆదేశం**

**సైబరాబాద్, విశాలభారతి:**

వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వినాయక్ పార్క్,సీనియర్ సిటిజన్ పార్కుల్లో గురువారం ఉదయం 8 గంటల నుంచి 9:30 వరకు గంటన్నర పాటు సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన విస్తృతంగా పర్యటించారు. జోనల్ కమిషనర్ పర్వత్ చౌహాన్, ఆల్విన్ కాలనీ సర్కిల్ డీసీ చాముండేశ్వరితో కలిసి రెండు పార్కుల్లో కాలినడకన తిరిగి స్థానికులు, సీనియర్ సిటిజన్లతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.వాకింగ్ ట్రాక్ పాడవడం, ఓపెన్ జిమ్ పరికరాలు లేకపోవడం, లైటింగ్ సమస్య, వీధి కుక్కల బెడద, వర్షాకాలంలో నీటి నిల్వ, డ్రైనేజీ సమస్యలను స్థానికులు కమిషనర్ సృజన దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్ ఆదేశాలు..... ఫిర్యాదుల న్నీ నోట్ చేసుకున్న కమిషనర్ సృజన, వివేకానంద నగర్ డివిజన్‌లో వర్షాకాలం లోపు సమస్యలన్నీ పరిష్కరించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డీసీ చాముండేశ్వరి ప్రతిరోజూ పనులను పర్యవేక్షించి నివేదిక ఇవ్వాలని సూచించారు.

**10 కీలక సూచనలు:**

1. **పార్కులు:** వినాయక్ పార్క్, సీనియర్ సిటిజన్ పార్కుల్లో వాకింగ్ ట్రాక్ మరమ్మతులు, ఓపెన్ జిమ్, ఎల్ఈడీ లైట్లు. ఆర్‌డబ్ల్యూఏలతో కంపోస్టింగ్ అవగాహన.
2. **రోడ్లు:** గుంతలు, ప్యాచ్‌వర్క్‌ను ఏఈలు 3 రోజుల్లో గుర్తించి మే 15 లోపు పూర్తి చేయాలి.
3. **పారిశుధ్యం:** స్వీపింగ్ పాయింట్లు తగ్గించి పర్యవేక్షణ పెంచాలి. కార్మికుల బయోమెట్రిక్ హాజరు, పనితీరు సమీక్ష.
4. **వీధి కుక్కలు:** వెటర్నరీ విభాగం వారానికి 50 కుక్కలకు స్టెరిలైజేషన్ చేపట్టాలి.
5. **దోమల నివారణ:** వారానికి రెండుసార్లు ఫాగింగ్. ఇంటింటికీ లార్వా తనిఖీలు.
6. **నాలాలు:** డీఈ పర్యవేక్షణలో 7 రోజుల్లో సిల్ట్ పూర్తిగా తొలగించాలి.
7. **సీ అండ్ డీ వ్యర్థాలు:** రోడ్లపై వేస్తే రూ.5 వేలు జరిమానా. ఖాళీ స్థలాలకు 15 రోజుల్లో ఫెన్సింగ్ నోటీసులు.
8. **హెల్ప్‌డెస్క్:** స్థానికుల ఫిర్యాదుల కోసం సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్.
9. **రిపోర్ట్:** ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు ఫొటోలతో పురోగతి నివేదిక.
10. **డెడ్‌లైన్:** వర్షాకాలానికి ముందే అన్ని పనులు 100% పూర్తి కావాలి.

కార్యక్రమంలో ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ రవి, ఏఈలు, శానిటేషన్, ఎంటమాలజీ, వెటర్నరీ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌లో ఆర్టీసీ కార్మికుల సమ్మె రెండో రోజు



**రాజేంద్రనగర్, విశాలభారతి :**

ఆర్టీసీ కార్మికుల సమ్మె రెండో రోజు కూడా కొనసాగుతూ, రాజేంద్రనగర్ ప్రాంతంలో రవాణా సేవలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. సమ్మె ప్రభావంతో రాజేంద్రనగర్ డిపోకు చెందిన బస్సులు డిపోకే పరిమితమై ఉండటంతో, రోజువారీ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు, అత్యవసర పనుల కోసం ప్రయాణించాల్సిన ప్రజలు ప్రత్యామ్నాయ రవాణా మార్గాల కోసం తంటాలు పడుతున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు రాజేంద్రనగర్ డిపో ఎదుట ధర్నాకు దిగారు. కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, త్వరితగతిన చర్చలు జరిపి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు మద్దతుగా ఆర్టీసీ యూనియన్ నాయకుడు అశ్వద్ధామ రెడ్డి రాజేంద్రనగర్ డిపోకు చేరుకొని కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లు న్యాయసమ్మతమైనవేనని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అవసరమైతే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమ్మె కొనసాగుతున్న నేపథ్యంలో రవాణా సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం త్వరగా జోక్యం చేసుకొని సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

## స్కూళ్లకు వేసవి సెలవులు ప్రారంభం

**జూన్ 11 వరకు విరామం**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**



ఏడాదంతా పాఠాలు, పరీక్షలతో నిమగ్నమైన విద్యార్థులకు రేపటి నుంచి ఉపశమనం లభించనుంది. తెలంగాణ రాష్ట్రంలో పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభమై జూన్ 11 వరకు కొనసాగనున్నట్లు అబ్దుల్లాపూర్ మెట్ మండల విద్యా అధికారి (ఎంఈఓ) జగదీష్ తెలిపారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో మధ్యాహ్నం వేళల్లో పిల్లలు బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో మాత్రమే ఆటలకు అనుమతించడం మంచిదని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈత కోసం చెరువులు, కాల్వల వద్దకు వెళ్లే సమయంలో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి అని ఎంఈఓ జగదీష్ హెచ్చరించారు. పిల్లలు ఎటువంటి ప్రమాదకర ప్రదేశాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇక సెలవుల సమయంలో పూర్తిగా చదువుల నుంచి దూరం కాకుండా రోజుకు కనీసం ఒక గంటపాటు పాఠ్యాంశాల పునశ్చరణ చేయించాలని, దీంతో విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి కొనసాగుతుందని తెలిపారు. అదేవిధంగా క్రీడలు, పాఠ్యేతర కార్యకలాపాల్లో పాల్గొనేలా పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులు ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జగదీష్ కోరారు

## హార్టికల్చర్ సీట్ల కేటాయింపుపై విద్యార్థుల ఆందోళన



**రాజేంద్రనగర్, విశాలభారతి :**

శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర హార్టికల్చర్ విశ్వవిద్యాలయంలో పీజీ మరియు పీహెచ్‌డీ విద్యార్థులు హార్టికల్చర్ సీట్ల కేటాయింపుపై నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ అంశం ఇటీవల వార్తల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. వచ్చే విద్యా సంవత్సరంనుంచి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 30 బీఎస్సీ హార్టికల్చర్ సీట్లు, 8 ఎంఎస్సీ సీట్లు కేటాయించనున్నట్లు వచ్చిన సమాచారంపై విద్యార్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హార్టికల్చర్ కోర్సులు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న విశ్వవిద్యాలయం ఉన్నప్పటికీ, అదే కోర్సులకు మరో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సీట్లు కేటాయించడం సరైన నిర్ణయం కాదని వారు పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల హార్టికల్చర్ విశ్వవిద్యాలయం ప్రాముఖ్యత దెబ్బతింటుందని, విద్యార్థుల అవకాశాలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ధర్నా చేపట్టారు. వారం రోజుల్లోగా ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు స్పందించకపోతే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని విద్యార్థి నాయకులు హెచ్చరించారు. హార్టికల్చర్ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించి, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సముచిత నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## భగీరథ మహర్షి జయంతిలో పీఏసీ చైర్మన్ గాంధీ

- **సగర సంఘానికి అండగా ఉంటా అని హామీ**



**కుత్బుల్లాపూర్‌విశాలభారతి:** సగర ఉప్పర కుల గురువు శ్రీశ్రీశ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలు జగద్గిరిగుట్ట సగర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై మహర్షికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, "తపస్సుతో గంగను భువికి తెచ్చిన భగీరథుడు పట్టుదలకు ప్రతీక. సగర సంఘం సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తా. ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా" అని హామీ ఇచ్చారు.సగర యువజన సంఘం ఆధ్వర్యంలో భగీరథ శోభాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వేముల సుదర్శన్ సాగర్, ఎమ్మెస్ భీమయ్య, వెంకటరమణ సాగర్, లక్ష్మీ సగర, జ్యోతి సగర, సంజీవ రెడ్డి, చంద్రకాంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

## హఫీజ్‌పేట్‌లో ఘనంగా భగీరథ మహర్షి జయంతి

- **సగర సంఘం ఆధ్వర్యంలో వేడుకలు.. బాలింగ్ గౌతమ్ గౌడ్ నివాళులు**



**శేరిలింగంపల్లివిశాలభారతి:** భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకొని గురువారం హఫీజ్‌పేట్ డివిజన్‌లోని ప్రకాష్‌నగర్ కాలనీలో 'సాగర సంగం' ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాలింగ్ గౌతమ్ గౌడ్ భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి భక్తులకు స్వయంగా వడ్డించారు.ఈ సందర్భంగా గౌతమ్ గౌడ్ మాట్లాడుతూ,పట్టుదలకు, కఠోర దీక్షకు నిదర్శనం భగీరథ మహర్షి. తన తపస్సుతో గంగను భువికి రప్పించి లోక కల్యాణం చేసిన ఆ మహనీయుని ఆశయాలను, ఆయన చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి. నేటి తరం యువత భగీరథుడి సంకల్పాన్ని ఆదర్శంగా తీసుకోవాలి" అని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సాగర సంగం అధ్యక్షుడు, సభ్యులు, ప్రకాష్‌నగర్ కాలనీ అధ్యక్షుడు, స్థానికులు, మహిళలు, యువకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళా బిల్లు వీగిపోవడంపై బీజేపీ ఆగ్రహ ర్యాలీ

- **కాంగ్రెస్ వల్లే మహిళా లోకానికి చీకటి రోజు..రవికుమార్ యాదవ్**




**శేరిలింగంపల్లి విశాలభారతి:** పార్లమెంట్‌లో 33% మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడానికి కాంగ్రెస్ కారణమని ఆరోపిస్తూ బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గురువారం 'మహిళా ఆక్రోష్ ర్యాలీ' నిర్వహించారు. ట్యాంక్‌బండ్ జీహెచ్ఎంసీ కార్యాలయం నుంచి ఇందిరాపార్క్ వరకు సాగిన ర్యాలీలో మసీద్‌బండ, కొండాపూర్, శేరిలింగంపల్లి నుంచి వేలాది మంది మహిళలు పాల్గొన్నారు.బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి మారబోయిన రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ, "మహిళా బిల్లుకు మద్దతివ్వకుండా కాంగ్రెస్ ద్రోహం చేసింది. దీంతో చట్టసభల్లో మహిళలకు దక్కాల్సిన అవకాశం చేజారింది. మహిళాగ్రహంతో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం" అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ యాదవ్, వసంత్ యాదవ్, ఎల్లేష్, రాజు శెట్టి, విష్ణు దత్తు, వినయ, పద్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మియాపూర్‌లో చలివేంద్రం ప్రారంభం

- **జనసేన నేత కేశవరావు సిళ్ళ ఆధ్వర్యంలో ఏర్పాటు**
- **ముఖ్య అతిథిగా హాజరైన యలమంచి ఉదయ్ కిరణ్**



**శేరిలింగంపల్లి విశాలభారతి:** మండే ఎండల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు మియాపూర్ డీమార్ట్ సమీపంలో జనసేన నాయకుడు, శ్రీరంగాపురం కాలనీ అధ్యక్షుడు కేశవరావు సిళ్ళ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. గురువారం యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఇరువురూ పరస్పరం శాలువాలతో సత్కరించుకున్నారు.అనంతరం పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ, "వేసవిలో ప్రజల దాహం తీర్చడం ప్రతి ఒక్కరి బాధ్యత.



# హిట్స్ కోసం ఎదురుచూస్తున్న శ్రీలీల

కన్నడ సినిమాలతో కెరీర్ ప్రారంభించి, టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన శ్రీలీల ప్రస్తుతం తన కెరీర్‌లో కీలక దశను ఎదుర్కొంటోంది. ప్రారంభంలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని టాప్ హీరోయిన్ రేసులోకి వచ్చిన ఆమె... ఇప్పుడు మాత్రం వరుస ఫలితాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు కనిపిస్తోంది. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'పెళ్లి సందడి' సినిమాతో శ్రీలీల టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా... ఆమెకు మాత్రం మంచి గుర్తింపు వచ్చింది. మొదటి సినిమా ఫ్లాప్ అయినా కూడా, ఇండస్ట్రీలో ఆమెకు వరుస అవకాశాలు రావడం విశేషం.రవితేజ సరసన నటించిన 'ధమాకా' సినిమా బ్లాక్‌బస్టర్ కావడంతో శ్రీలీల కెరీర్ ఒక్కసారిగా టర్న్ అయింది. ఆ విజయంతో ఆమె టాలీవుడ్‌లో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. వరుసగా అరడజను సినిమాలు ఆమె చేతిలో పడగా, కొన్నింటి ఫలితాలు నిరాశపరిచాయి. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీలీల వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, పెద్ద హిట్ మాత్రం ఆమెకు దక్కలేదు. 'పుష్ప 2'లో చేసిన ప్రత్యేక డాన్స్ నంబర్‌తో ఇతర భాషల ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఆమెకు తమిళ, హిందీ ఇండస్ట్రీల్లో అవకాశాలు కూడా వచ్చాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.